# నల్లగొండ జిల్లా
# ప్రజల భాష

డా॥ ఆర్. శ్రీహరి

494.827
నల్ల
45848

ప్రచురణ :

పతంజలి పబ్లికేషన్స్
హైదరాబాదు-500 659.

# నల్లగొండజిల్లా ప్రజల భాష

Dr. R. SRI HARI
Professor & Head Dept. of Telugu
University of Hyderabad,
Hyderabad.

ప్రచురణ :

పతంజలి పబ్లికేషన్స్
హైదరాబాదు-500 659.

"NALLAGONDA ZILLA PRAJALA BHASHA"

by Dr. R. SRI HARI, M.A., Ph.D., Professor & Head,
Dept. of Telugu, University of Hyderabad, Hyderabad.

Copies : 1000

C.6912

Price : Rs 12-00

1993

500 044.

For Copies :

R Anantalaxmi
16 2-826/F/2, Madhavanagar,
Saidabad, Hyderabad 500 659.

Printed at :

Padmavati Art Printers
1-1-517/B/1, New Bakaram,
Gandhinagar, Hpderabad-380.
Phones : 611413, 600547

# ముందుమాట

ఈ గ్రంథకర్త నల్లగొండజిల్లా వాడుకలో ఉన్న మాండలిక పదాలను సేకరించి 'నల్లగొండజిల్లా మాండలిక పదకోశం' అన్న నిఘంటువును కూర్చి 1988 లో ప్రకటించడం జరిగింది. ఆ నిఘంటువు ఆధారంగా చేసిన పరిశీలనమే ఈ చిన్న గ్రంథం.

ధ్వనుల మార్పులు, నామవిభక్తులు, నామపదాలు, క్రియా పదాలు, సంధులు, ధ్వన్యాద్యనుకరణపదాలు, వాక్య నిర్మాణం - ఈ అంశాల్లో నల్లగొండ జిల్లా ప్రజల వాడుకలో కనిపించే విశేషాలు ఇందులో వివరింపబడ్డాయి.

గ్రంథంచివర అనుబంధాల్లో నల్లగొండజిల్లా వాడుకలో ఉన్న కొన్ని సామెతలు, మాండలిక పదాలు - పదబంధాలు, కావ్య ప్రయోగాలు చూపబడ్డాయి.

తెలుగుదేశంలోని అన్నిజిల్లాల వాడుకభాషను సమగ్రంగా అధ్యయనం చేసినప్పుడే తెలుగుభాషయొక్క సమగ్రస్వరూపాన్ని దర్శించుకునే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం కలవాణ్ని. ఈ అభిప్రాయంతో తొలుత నల్లగొండజిల్లాప్రజల వాడుకభాషా స్వరూపాన్ని నా ఎరుకమేరకు వివరించే ప్రయత్నం చేసినాను.

ఈ నా ప్రయత్నాన్ని విద్వాంసులు హర్షిస్తారని ఆశిస్తాను.

—ఆర్. శ్రీహరి


నల్లగొండ జిల్లా
మెదక్ జిల్లా
వరంగల్లు జిల్లా
ఖమ్మం జిల్లా
కృష్ణా జిల్లా
రంగారెడ్డి జిల్లా
మహబూబ్ నగర్ జిల్లా
గుంటూరు జిల్లా
ఆలేరు
భువనగిరి
మోతుకూరు
రామన్నపేట
నార్కట్‌పల్లి
మునుగోడు
నల్లగొండ
తుంగతుర్తి
సూర్యాపేట
మునగాల
కోదాడ
హుజూర్ నగర్
మిర్యాలగూడా
దేవరకొండ
నాగార్జున సాగర్
కృష్ణా
కృష్ణా

# నల్లగొండజిల్లా ప్రజల భాష

నేటి నల్లగొండజిల్లా 14240 చ.కి.మీ వైశాల్యంలో విస్తరించి ఉన్నది ఈ జిల్లాకు ఉత్తరంలో వరంగల్ మెదక్ జిల్లాలు, తూర్పున ఖమ్మం కృష్ణా జిల్లాలు, దక్షిణంలో గుంటూరు మహబూబ్‌నగర్ జిల్లాలు, పశ్చిమంలో హైదరాబాద్ మహబూబ్‌నగర్ జిల్లాలు ఎల్లలుగా ఉన్నాయి. కృష్ణానది, మూసీనది, పెద్దవాగు, డిండి ఈ జిల్లాలో ప్రవహించే ముఖ్యనదులు. కృష్ణానది దేవరకొండ తాలూకాకు చెందిన ఏలేశ్వరం దగ్గర ఈ జిల్లాలో ప్రవేశిస్తుంది. ఒకప్పుడు ఊసర క్షేత్రంగా ఉన్న ఈ జిల్లాలోని కొంతభాగం కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగరం ఎడమ కాలువవల్ల సస్యశ్యామలమైనది.

హైదరాబాదునుండి విజయవాడకు పోయే రైలుమార్గం, రోడ్డు మార్గం ఈ జిల్లానుండే పోతాయి. కొత్తగా తలపెట్టిన బీబీనగర్-నడికుడి రైల్వేమార్గం కూడా ఈ మధ్యనే పూర్తి ఐనది.

నల్లగొండ, దేవరకొండ, రాచకొండ, భువనగిరి, పానగల్లు- ఈ జిల్లాలోని చారిత్రక ప్రాముఖ్యం కలిగిన పట్టణాలు. నల్లగొండ పట్టణానికి మూడు కి.మీ. దూరంలో ఉన్న పానగల్లు నేడొక చిన్న గ్రామమే ఐనా ఒకనాడు గొప్ప రాజధానిగా విలసిల్లిన మహానగరం.

ఆచార్య వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి ఓంకారం పలికి, యావద్భారతదేశంలో గుర్తింపు పొందిన పోచంపల్లి గ్రామం నల్లగొండ జిల్లాలోనిదే. పట్టుచీరెల తయారీకి ఈ గ్రామం ప్రసిద్ధిపొందిన విషయం అందరికీ తెలిసిందే.

నల్లగొండ జిల్లా చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతాన్ని వరుసగా శాతవాహనులు,ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, పద్మనాయకులు, గోలకొండ నవాబులు పరిపాలించినారు. నల్లగొండ, దేవరకొండ, భువనగిరి, రాచకొండ, పానగల్లు మొదలైనవి చారిత్రక ప్రసిద్ధిగల ప్రాంతాలు. ఒకనాడు అపూర్వమైన శోభతో విలసిల్లిన ప్రాచీన నగరాలెన్నో నేడు ఈ ప్రాంతపు గతవైభవాన్ని మూగనోళ్ళతో చాటుతున్నాయి.

రామన్నపేట తాలూకాలోని వలిగొండకు సమీపాన మూసీనది ఒడ్డున విష్ణుకుండినుల రాజధానీ నగరమైన ఇంద్రపాలనగరం విలసిల్లి ఉండినదని ఇటీవల బి. ఎన్. శాస్త్రిగారి పరిశోధనవల్ల తెలియ వచ్చింది.

ప్రాచీనకాలంలో ఈ జిల్లాలో జైన బౌద్ధమతాలు రాజాశ్రయం పొంది వర్ధిల్లినాయి. ఇందుకు ఇంద్రపాల నగరం, ఫణిగిరి, గాజుల బండ, సిరికొండ మొ॥ ప్రాంతాల్లోని శిథిల జైనవసదులు, బౌద్ధారామ విహారాలు సాక్ష్యాలు. పిల్లలమర్రి, పానగల్లు, నాగులపాడు, గణప వరం, వా(ఓ)డపల్లి మొ॥ ప్రాంతాల్లోని శైవ వైష్ణవ దేవాలయాలు ఇక్కడ వ్యాపించిన శైవవైష్ణవ మతాలకు ప్రతీకలు.

నల్లగొండ జిల్లాలోని పానగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు గ్రామాల్లో కాకతీయులు నిర్మించిన దేవాలయాల్లోని శిల్పవైభవం చూపరులను ముగ్ధులను చేస్తుంది. పానగల్లులోని ఛాయా సోమేశ్వ రాలయంలో నడుములోతు నీటిలో మునిగి ఉన్న శివలింగంమీద అన్నివేళలా నీడ ఆవహించి సూర్యోదయంనుండి సూర్యాస్తమయం దాకా ఏ మాత్రమూ చలించకుండా ఉండడం, గర్భాలయానికి ఎదురుగా నిలబడినప్పుడు ఎదురుగా గోడపై మూడేసి ఛాయలో, ఐదేసి ఛాయలో కనిపించడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయాలు.

ఈ జిల్లాలో కొలనుపాక (జైనమందిరం), యాదగిరిగుట్ట (శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం), మూసీ కృష్ణా నదుల సంగమమైన వా(ఓ)డపల్లి (అగస్త్యేశ్వరాలయం, నృసింహస్వామి ఆలయం), జీడికల్లు (రామాలయం) ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు.

కృష్ణానదిపై కట్టిన నాగార్జునసాగర్ ఆనకట్ట ఈ జిల్లాలోని ముఖ్యమైన ఆకర్షణ. ఈ జిల్లాకు చెందిన కొన్నివేల ఎకరాలకు నీటి సదుపాయాన్ని కలిగిస్తున్నది. లక్షలాది జనానికి అన్నభిక్ష ప్రసాదిస్తున్నది.

వ్యవసాయం ఈ జిల్లా ప్రజల ముఖ్యవృత్తి. తరువాత పేర్కొనదగినది నేత వృత్తి.

హిందూ ధర్మానికి గుండెకాయ వంటిదైన సంస్కృత సాహిత్యానికి పట్టుగొమ్మగా నిలిచిన 'రాచకొండ' సంస్థానం నల్లగొండ జిల్లాలోనిదే రాచకొండ నేలిన పద్మనాయక రాజులలో ప్రసిద్ధుడైన సర్వజ్ఞ సింగభూపాలుడు సంస్కృతంలో రసార్ణవ సుధాకర మనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని రచించినాడు.

తెలుగు కవితా క్షేత్రాన్ని సుసంపన్నం చేసిన ఆసూరి మరింగంటి కవులు దేవరకొండ తాలూకా కనగల్లు వాసులు.

ఈ జిల్లాలో ప్రధానంగా మాట్లాడే భాష తెలుగు. దీనితో పాటు లంబాడీ, ఉర్దూ మాండలికాలు కూడా వాడుకలో ఉన్నాయి.

ప్రజల వాడుకలో ఉన్న భాష ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. నన్నయ కాలంనాటి తెలుగుకూ, నేటి తెలుగుకూ ఉన్న భేదం మనకు తెలిసిందే. భిన్న కాలాల్లో ఉన్న భాషలోనే కాక ఏక

కాలంలో ఉన్న భాషలో కూడా ఈ భేదం కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రాంతాల ప్రజలు మాట్లాడేది తెలుగు భాషే ఐనా అది అంతటా ఒకే రూపంలో వినిపించదు. ఒకే భాషలో ప్రజల వ్యవహారంలో పదాల్లోనూ, ఉచ్చారణలోనూ, పదాల అర్థాల్లోనూ, ప్రత్యయాల్లోనూ తేడాలు ఉంటాయి. ఒకే భాషకు చెందిన ఈ భేదాలను మాండలికాలు అని అంటారు. ప్రాంతాన్ని బట్టి, వృత్తిని బట్టి, విద్యార్హతలను బట్టి వేరువేరు మాండలికాలు ఏర్పడతాయి. మహాభాష్యకారుడైన భగవత్పతంజలి మహాభాష్యంలో నాటి సంస్కృత భాషలోని మాండలికాలను గుర్తించినట్లు కింది వాక్యాల వల్ల తెలుసుకోవచ్చు.

"శవతిర్గతికర్మా కంబోజేష్వేవ భాషితో భవతి, వికార మేవైనమార్యా భాషంతే శవ ఇతి" (పస్పశాహ్నికం)

(గత్యర్థకమైన 'శవ'ధాతువుకు ఆ అర్థంలో కంబోజ దేశంలోనే వ్యవహారం. ఆర్యులు దీనిని గత్యర్థంలో వాడక 'శవము' అనే అర్థంలోనే వాడుతారు.) స్థల మాండలికాలు, కుల మాండలికాలు మొదలైనవి మాండలికాల్లోని భేదాలు.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు వృత్తిపద పరిశీలన ఆధారంగా తెలుగుదేశాన్ని నాలుగు భాషా మండలాలుగా విభజింప వచ్చునని నిరూపించినారు. అవి: 1. పూర్వమండలం (శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలు), 2. దక్షిణ మండలం (రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు) 3. ఉత్తర మండలం (తెలంగాణా- మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల్లో కోస్తా, రాయలసీమలను ఆనుకున్న తాలూకాలు ఆయా భాషా మండలాల్లో కలుస్తాయి. 4. మధ్య మండలం (ఉభయ గోదావరులు, కృష్ణా గుంటూరు జిల్లాలు.) ఈ

విభజన ప్రకారం నల్లగొండ జిల్లా ఒక ప్రత్యేకమైన భాషామండలం కాదు. ఈ జిల్లాలో వాడుకలో ఉన్న మాండలిక పదాలు చాలావరకు తెలంగణా జిల్లాలన్నింటిలో కనిపించినా కొన్ని పదాలు నల్లగొండ జిల్లా వ్యవహారంలో మాత్రమే ఉన్నాయి. ఐతే తెలంగాణంలోని ప్రతి జిల్లా వాడుకభాషకు మాండలిక పదకోశాలు సిద్ధమైనప్పుడు ఏయే పదాలు నల్లగొండజిల్లాలోని వాడుకకు మాత్రమే పరిమితమైనాయో స్పష్టంగా చెప్పడానికి వీలౌతుంది.

అయా వృత్తులకు సంబంధించిన మాండలిక పదజాలమంతా వృత్తిపదకోశాల్లో సేకరింపబడింది. కాని ఏ వృత్తికి సంబంధించని మాండలిక పదాలు కూడా ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా సేకరించవలసిన అవసరం ఎంతో ఉంది.

ప్రస్తుతం ఈ వ్యాసకర్త కూర్చిన 'నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం" ఆధారంగా నల్లగొండ జిల్లా వాడుకభాషలోని విశేషాలను పరిశీలిద్దాం.

## ధ్వనుల మార్పులు

న. జి. వాడుకలో ధ్వనుల విషయంలో కనబడే ప్రత్యేకతలు ఈ కింది విధంగా ఉన్నాయి. ఉదాహరణంగా చూపబడ్డ పదాలు విద్యావంతులైన శిష్టుల వ్యవహారం నుండే కాక జానపదుల వ్యవహారంనుండి కూడా గ్రహింపబడ్డాయి.

**అచ్చుల్లో పర్యాయరూపత**

**a) పదాది అచ్చుల్లో**

i) అ - ఏ

దళమానుడు    దెళమానుడు

ii) అ - ఒ

| | |
|---|---|
| మగ్గం | మొగ్గం |

iii) ఆ - అ

| | |
|---|---|
| కాని | కని |

iv) ఆ - ఈ

| | |
|---|---|
| సారి | సీరి / (వెనుకసీరి) |

v) ఇ - ఉ

| | |
|---|---|
| ఇసుక | ఉసుక |

vi) ఇ - ఒ

| | |
|---|---|
| పిల్ల | పొల్ల |

vii) ఎ - ఒ

| | |
|---|---|
| రెండు | రొండు |

viii) ఒ/ఓ - ఆ

| | |
|---|---|
| పొండి / పోండి | పాండి |
| పోరాదు | పారాదు |

b) పదమధ్య అచ్చుల్లో

i) అ - ఆ

| | |
|---|---|
| దినం | దినాం (ప్రతిదినం) |

ii) అ - ఇ

| | |
|---|---|
| తడక | తడికె |

iii) అ - ఉ

| | |
|---|---|
| తగరం | తగురం |

iv) ఉ - ఇ

| | |
|---|---|
| బాడుగ | బాడిగె |

c) పదాంత అచ్చుల్లో

i) అ - ఎ

| | |
|---|---|
| ఓపిక | ఓపికె |
| బాడుగ | బాడిగె |
| మడిగ | మడిగె |
| నాలుక | నాలికె |
| సకినం | సకినెం |
| తడక | తడికె |
| జలగ | జనిగె |
| ఈగ | ఈగె |
| పదిలం | పదిలెం |
| దూడ | దూడె, దుడ్డె |
| బలిజ | బలిజె |
| బిడ్డ | బిడ్డె |
| అటిక | అటికె |

ii) ఉ - అ

| | |
|---|---|
| చదువుకుంటు | చదువుకుంట |

iii) దీర్ఘం - హ్రస్వం

| | |
|---|---|
| బాగా | బాగ |
| అట్లా | అట్ల |
| ఇట్లా | ఇట్ల |
| వస్తా | వస్త |

హల్లుల్లో పర్యాయరూపత

a) పదాది హల్లుల్లో

i) జ - ద

| | |
|---|---|
| జడుసుకొను | దడుసుకొను |
| జంట | దంట |

ii) త - ట

| | |
|---|---|
| తొంబై | టొంబై |

iii) ద - డ

| | |
|---|---|
| దొలువు | డొలుపు |
| దొప్ప | డొప్ప |
| దేకిలి | డేకిలి |
| దోకా | డోకా |

iv) న - ల

| | |
|---|---|
| నుక్సాన్ | లుక్సాన్ |
| నోటు | లోటు |

v) మ - న

| | |
|---|---|
| మిర్పకాయ | నిర్పకాయ |
| మిరుపొరుగు | నిరుపొరుగు |

b) అపదాది హల్లుల్లో

i) క - గ

| | |
|---|---|
| ఇక | ఇగ |
| ఒకడు | ఒగడు |

ii) గ - య

| | |
|---|---|
| కాగితం | కాయితం |

iii) జ - ద

| | |
|---|---|
| సజ్జలు | సద్దలు |

iv) ద - జ

| | |
|---|---|
| బుదారం | బుజారం |
| అందాద | అందాజ |

v) ప - వ

| | |
|---|---|
| బాపనాయన | బావనాయన |

vi) బ - వ

| | |
|---|---|
| గాబర | గావర |
| నిలబడు | నిలవడు |

vii) బ - మ

| | |
|---|---|
| బంటి (దమ్మార్థకం) | మంటి |

viii) య - ల

| | |
|---|---|
| అన్యాయం | అన్యాలం |

ix) ర - న

| | |
|---|---|
| రాత్రి | నాత్రి? |

x) ర - ల

| | |
|---|---|
| ఒకరు | ఒగలు |
| ఎవరు | ఎవలు |
| జుర్మాన | జుల్మాన |
| ఆదరబాదర | ఆదలబాదల |
| దుర్ద (దురద) | దుల్ద |

xi) ల - న

| | |
|---|---|
| చాల | చాన |
| తొలుకు | తొనుకు |
| జలగ | జెనిగె |
| కందిలి | కందిని |

xii) ల - ర

| | |
|---|---|
| తొల్చూలు | తొల్చూరు |

xiii) వ - గ

| | |
|---|---|
| పిల్లవాడు | పిల్లగాడు |

xiv) వ - య

| | |
|---|---|
| అవి | అయి |
| ఇవి | ఇయి |
| ఖావి | ఖాయి |
| వావి | వాయి |
| కావించు | కాయించు |

xv) త్య - చ్చ

| | |
|---|---|
| నిత్యం | నిచ్చెం, నిచ్చె |
| సత్యం | సచ్చెం |

వర్ణలోపం

a) పదాద్యక్షరలోపం

| | |
|---|---|
| వెల్లిగడ్డ | ఎల్లిగడ్డ |
| వ్యవసాయం | ఎవుసాయం |

b) పదమధ్య వర్ణలోపం

| | |
|---|---|
| ఊరికె | ఊకె . |
| వెడల్పు | ఎల్పు |
| మామిడికాయ | మాడికాయ |
| ఊరుకో | ఊకో |
| తావున | తాన |
| లేకపోతె | లేపోతె |
| ఖాగనె | ఖానె |
| బతిమిలాడు | బతిలాడు |

c) ద్విత్వలోపం

| | |
|---|---|
| పిల్లగాడు | పిలగాడు |

d) అపదాదిహ్రస్వాచ్చు లోపం

అపదాది హ్రస్వాచ్చులు లోపించడం న. జి. వాడుకలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది తెలంగాణమంతటా కనిపించే లక్షణంగా భావించవచ్చు. కింద పేర్కొన్న హల్లుల మధ్య ఉన్న హ్రస్వాలు లోపిస్తున్నట్లుగ ఉదాహరణలవల్ల తెలుస్తుంది.

| | | | |
|---|---|---|---|
| | క - చ | నాకు చదువు రాదు | నాక్చదువురాదు |
| i | క - ప | చెయ్యకపోతె | చెయ్యక్పోతె |
| | క - ర | ఎందుకు రాదు | ఎందుక్రాదు |
| | క - వ | ఎక్కువ | ఎక్వ |
| ii | గ - త | జరుగుతది | జరుగ్తది |
| iii | ట - క | అటుకులు | అట్కులు |
| | | పుట్టుక | పుట్క |
| | ట్ట - న | ముట్టినయ్ | ముట్నయ్ |
| | ట - ప | అటుపక్క | అట్పక్క |
| | ట - వ | అటువంటి | అట్వంటి |
| iv | డ - క | ఉడుకు | ఉడ్కు |
| | | ఇక్కడికి | ఇక్కడ్కి |
| | డ - గ | పండుగ | పండ్గ |
| | డ - త | పెడితె | పెడ్తె |
| | | మడత | మడ్త |
| | డ - ద | ఆడిదాంక | ఆడ్దాంక |
| | | ఆడది | ఆడ్ది |
| | డ - న | ఆడిన | ఆడ్న |
| | | ఆడనే | ఆడ్నే |
| | ఢ - ప | కడప | కడ్ప |
| | | ముడుపు | ముడ్పు |

| | | | |
|---|---|---|---|
| | డ - మ | కడమ | కడ్మ |
| | డ - వ | నడువాలె | నడ్వాలె |
| | డ - స | గుడిసె | గుడ్సె |
| v | త - క | బతికిండు | బత్కిండు |
| | | కుతికె | కుత్కె |
| vi | ద - క | ఎందుకంటె | ఎంద్కంటె |
| | ద - స | ఏందిసార్ | ఏంద్సార్ |
| vii | న - క | దనుక | దన్క |
| | న - గ | అనగదొక్క | అన్గదొక్క |
| | న - చ | అనిచెప్పు | అన్చెప్పు |
| | న - త | వానితోటి | వాన్తోటి |
| | న - ద | వానిదగ్గర | వాన్దగ్గర |
| | న - మ | మనుమరాలు | మన్మరాలు |
| | న - ర | నిన్ను రమ్మన్నరు | నిన్ర రమ్మన్నరు |
| | | ఇన్నిరోజులు | ఇన్రోజులు |
| viii | ప - క | పెంపకం | పెంప్కం |
| | | రూపకం | రూప్కం |
| | ప - త | నింపుతరు | నింప్తరు |
| | | నాయన | నాయ్న |
| ix | య - న | పోయినం | పోయ్నం |
| | ర - క | మరక | మర్క |
| | ర - చ | మరచిపోవు | మర్చిపోవు |
| x | ర - ణ | కారణం | కార్ణం |
| | | దోరణం (తోరణం) | దోర్ణం |
| | ర - ప | మిరపకాయలు | మిర్పకాయలు |
| | ర - ల | మరలబడు | మర్లబడు |

| | | | |
|---|---|---|---|
| x | ర - వ | ఇరవై | ఇర్వై |
| | ల - వ | తలుపు | తల్పు |
| | ల - క | పలక | పల్క |
| | ల - జ | బలిజ | బల్జ |
| xi | ల - బ | నలభై | నల్భై |
| | ల - మ | కొలిమి | కొల్మి |
| | ల - వ | అలవాటు | అల్వాటు |
| xii | స - న | చేసినంక | చేస్నంక |
| | స - క | మసక | మస్క |
| | | ఇసుక | ఇస్క |

వర్ణాగమం :

త్రికంలోని ఆ, ఈ అనే సర్వనామ శబ్దాలతో ఏర్పడే అప్పుడు, ఇప్పుడు, అక్కడ, ఇక్కడ; ఆమె, ఈమె మొదలైన పదాలకు ముందు గకారం, ఆగమంగా చేరడం న. జి. భాషలో - ముఖ్యంగా జానపదుల భాషలో కనిపిస్తుంది. ఈ లక్షణం తెలంగాణ మంతటా ఉన్నది.

| | | | |
|---|---|---|---|
| అప్పుడు | గప్పుడు; | ఆయన | గాయన |
| ఇక్కడ | గిక్కడ; | ఈడ | గీడ |
| ఆ పుస్తకం | గా పుస్తకం; | ఈ పుస్తకం | గీ పుస్తకం |

ఏ అనే త్రికానికి మాత్రం ఈ ఆగమం రాదు. అందువల్ల గెక్కడ, గెప్పుడు, గెవరు మొదలైన రూపాలు ఉండవు.

ఆవు, అరు, ఆట, ఆముదము, ఆలు; ఈక, ఈగ, ఈత, మొదలైన పదాల్లో త్రికం లేదు కనుక వీటికి గ కారం ఆగమంగా వచ్చి గావు, గారు, గాట మొదలైన రూపాలు ఏర్పడవు. జానపదులు

కూడా ఈ పదాలను గకారాగమంతో వ్యవహరించరు. అంటే ఈ గకారాగమం వచ్చే నియమానికి సంబంధించిన ఈ వివరాలేవీ తెలియకున్నా నియమం ప్రకారమే వారి వ్యవహారం జరగడం గమనించదగ్గ అంశం.

## సంధి

అ) న.జి. వ్యవహారంలో చదువాలె, తినాలె మొదలైనవి విధ్యర్థక క్రియలు. వీటికి అని, అయె మొదలైన అజాది పదాలు చేరినప్పుడు మధ్యలో నకారం ఆగమంగా వస్తుంది. 'లె' లోని ఎకారం లోపిస్తుంది.

ఉదా :- i) చదువాల్నని (చదువాలె + అని), తినాల్నని (తినాలె + అని), పోవాల్నని (పోవాలె + అని), రాయాల్నని (రాయాలె+అని).

ii) చదువాల్నాయె (చదువాలె + అయె), పోవాల్నాయె (పోవాలె+అయె)

చదువాలె మొదలైన క్రియలకు మూలరూపాలైన 'చదువవలెను' మొదలైన ప్రాచీన క్రియా పదాల్లోని చివరి నకారం సంధి చేసినప్పుడు తిరిగి కనిపించడం ఇక్కడ గమనించదగ్గ అంశం. ఇట్లే తద్ధర్మార్థక/భవిష్యదర్థక ఉ.పు. ఏకవచన క్రియల్లో కూడా సంధిలో లోపించిన నకారం తిరిగి కనిపిస్తుంది.

ఉదా :- వస్తనని, పోతనని, తింటనని, చదువుతనని. వ్యస్తంగా ఉన్నప్పుడు మాత్రం వస్త, పోత, తింట అనే లుప్తద్రుత రూపాలకే ప్రయోగం.

అ) ఉత్తరపదంగా ఉన్న క్రియాపదాల తొలి పరుషవర్ణాలు గజడ దబలుగా మారుతాయి. కొన్ని పదాల్లో పకారం వకారంగా కూడా మారుతుంది.

i) ఇల్లు గట్టిండు ఏం జెయ్యాలె
ఎవరు దాకిన్రు ఎవరు బోయిన్రు

ii) ఎక్కడ వోయిండు

కోస్తా, రాయలసీమ ప్రాంతాల వ్యవహారంలో కూడా ఈ లక్షణం కనిపించినా అది ద్రుతప్రకృతికాల మీద చేరిన అనుబంధ క్రియల పరుషాలకు మాత్రమే పరిమితమై కనిపిస్తుంది.

ఉదా : చేయజాలడు మొ॥

ఇ) సాధారణంగా తెలుగులో పరరూపాదేశ సంధి ప్రసిద్ధం. కాని న. జి. వ్యవహారంలో క్త్వార్థకం మీద ఉండు ధాతువు రూపాలు చేరినప్పుడు పరరూప సంధి కాక పూర్వరూప సంధి రావడం కనిపిస్తుంది. పూర్వరూప సంధితోపాటు మధ్యలో నకారాగమం వచ్చిన రూపాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.

వచ్చింటె/(వచ్చి+ఉంటె), వచ్చినుంటె; } తెచ్చింటె/(తెచ్చి+ఉంటె) తెచ్చినుంటె

వచ్చిందె / వచ్చినుందె (వచ్చి+ఉందె), తెచ్చిందె / తెచ్చినుందె (తెచ్చి+ఉందె)

ఈ విధమైన పూర్వరూపాదేశసంధి కోస్తా వ్యవహారంలో పైరూపాల్లో లేకపోయినా కింది రూపాల్లో మాత్రం కనిపిస్తుంది.

ఉదా:- రాదుట (రాదు+అట), వచ్చుట (వచ్చు+అట)

## నామవిభక్తులు

**ప్రథమాబహువచనం :**

కన్ను, పల్లు మొదలైన శబ్దాల బహువచన రూపాల్లో అంతమందున్న 'ండ్లు' స్థానంలో 'ళ్ళు' ఉన్న రూపాలే కోస్తా వ్యవహారంలో కనిపిస్తాయి. ఉదా: కళ్ళు, పళ్ళు మొ॥ కాని న. జి. వ్యవహారంలో 'ండ్లు'తో కూడిన రూపాలే కనిపిస్తాయి.

| కోస్తా | న. జి. |
|---|---|
| కళ్ళు | కండ్లు |
| పళ్ళు (పండు, పల్లు) | పండ్లు |
| వాళ్ళు | వాండ్లు |
| ఏళ్ళు | ఏండ్లు |
| ఇళ్ళు | ఇండ్లు |
| ముళ్ళు | ముండ్లు మొ॥ |

గొత్తి, బత్తి అనే పదాలకు బహువచనంలో ఈ కింది రూపాలు వాడుకలో ఉన్నాయి.

| | |
|---|---|
| గొత్తి | గొత్తిలు/గొర్లు/గొ్రలు |
| బత్తి | బత్తిలు/బర్లు/బ్రలు |

గొర్లు, బర్లు అనే రూపాల్లో వర్ణవ్యత్యయం వచ్చి గ్రొలు, బ్రలు అనే రూపాలు ఏర్పడ్డాయి.

**ద్వితీయావిభక్తి :**

కొన్ని బహువచనాంత పదాలమీద ద్వితీయా విభక్తి ప్రత్యయానికి లోపం కనిపిస్తుంది.

ఎడ్ల మేపుకొని వచ్చిండు. (ఎడ్లను)

మమ్ముల రమ్మన్నరు (మమ్ములను)

మేకల దోలుకొని పోయిండు (మేకలను)

వాండ్లను, వీండ్లను మొ॥ శబ్దాల్లో మాత్రం ఈ లోపం రాదు.

కోస్తా ప్రాంత వ్యవహారంలో కొన్ని రూపాల్లో ఇకారం మీదే కాక ఇతరాచ్చులపై కూడా ద్వితీయా విభక్తి ప్రత్యయం 'ను' 'ని'గా మారడం కనిపిస్తుంది. ఉదా : మనని, మనల్ని, వాళ్ళని, శ్రోతని. మొ॥ న. జి. వ్యవహారంలో మాత్రం ఇకారేతరాచ్చుపైన 'ను' 'ని'గా మారిన ఈ పదాలు వాడుకలో లేవు.

**తృతీయావిభక్తి :**

'తో' అనే తృతీయా విభక్తి ప్రత్యయంతోపాటు తోని, తోటి అనేవి కూడా న.జి. వ్యవహారంలో ఉన్నాయి.

పెన్నుతోని - పెన్నుతోటి

ఆయనతోని - ఆయనతోటి మొ॥

**చతుర్థీవిభక్తి :**

కొరకు అనే అర్థంలో వాడబడే కోసం అనేది కోసానికి/కొసానికి అనే రూపాల్లో కూడా వాడబడుతుంది.

ఆయనకోసానికి, ఆయనకొసానికి

ఇక్కడ 'కోసం' అనే శబ్దంపైన షష్ఠీ ప్రత్యయమైన 'కు' ప్రత్యయం చేరిందన్నమాట.

i) కాలవాచక పదాలపై పంచమీవిభక్త్యర్థంలో 'సంది' అనే ప్రత్యయం వాడుకలో ఉన్నది.

ఉదా :- అప్పటిసంది, నిన్నటిసంది, రేపటిసంది, ఏడాది సంది, ఎన్నాళ్ళసంది మొ॥

ii) ప్రాచీన కావ్యభాషలో కాలవాచక శబ్దాలపై పంచమ్యర్థంలో 'కోలెన్' ప్రత్యయం కనిపిస్తుంది. ఉదా: పిన్ననాటంగోలె, నాటంగోలె మొ॥ న జి. భాషలో ఈ ప్రాచీన ప్రత్యయం నేటికీ వాడుకలో ఉండడం గమనించదగ్గ అంశం.

ఏడాదిగోలె (ఏడాదినుండి), ఇన్నిదినాలగోలె (ఇన్నిదినాల నుండి) దీనికి 'గోలిగె' అనే రూపాంతరం కూడా వ్యవహారంలో ఉన్నది.

ఏడాదిగోలిగె, ఇన్నిదినాలగోలిగె మొ॥

ప్రాచీన భాషను వ్యాకరించిన చిన్నయసూరి కానీ, బహుజనపల్లి సీతారామాచార్యులు కానీ ఈ 'కోలెన్' ప్రత్యయాన్ని తమ వ్యాకరణాల్లో పేర్కొ లేదు.

iii) స్థలవాచకాలపై 'నుండి' అనే అర్థంలో కెల్లి, నించెల్లి అనే రూపాలు వాడుకలో ఉన్నాయి.

ఊరికెల్లి (ఊరినుండి) ఆడికెల్లి (అక్కడినుండి)

అణ్ణించెల్లి (అక్కడినుండి) ఈణ్ణించెల్లి (ఇక్కడినుండి)

iv) హేత్వర్థంలో వాడబడే వలన, వల్లకు బదులుగా న.జి. వ్యవహారంలో 'దిక్కుకెల్లి' 'నుంచి' అనే రూపాలకు కూడా ప్రయోగం కనిపిస్తుంది.

నీ దిక్కుకెల్లి (నీ కారణంగా) ఇన్ని కష్టాలు పడ్డ మొ॥

నీ నుంచి (నీ కారణంగా) ఇన్ని కష్టాలుపడ్డ మొ॥

v) క్రియా వ్యాపారం హేతువైనప్పుడు నుజ్యంతమైన ధాతువుపై 'పట్టి', పట్కె అనేవి చేరి హేత్వర్థక రూపాలు ఏర్పడడం న. జి. వాడుకలో కనిపిస్తుంది. కోస్తా వ్యవహారంలో మాత్రం అడాంతమైన భావార్థకంపై 'వల్ల' అనే ప్రత్యయం చేరి ఈ రూపాలు ఏర్పడుతాయి.

| కోస్తా | న. జి. |
|---|---|
| చెప్పడంవల్ల | చెప్పబట్టి/చెప్పబట్కె |
| అనడంవల్ల | అనఁబట్టి/అనబట్కె |
| రావడంవల్ల | రాబట్టి/రాబట్కె |
| ఇవ్వడంవల్ల | ఇవ్వబట్టి/ఇవ్వబట్కె |

చెప్పబట్టి, అనబట్టి మొదలైన రూపాలకు చెప్పడం వల్ల అనే హేత్వర్థంలోనే కాక 'చెప్పడం మొదలుపెట్టి' అని తదారభ్యార్థం (అది మొదలుపెట్టి అనే అర్థం) లో కూడా వాడుక కనిపిస్తుంది.

ఉదా :- "అయన మాకు ఇంగ్లీషు చెప్పబట్టి (చెప్పడం మొదలు పెట్టి) పదేండ్లైంది." ఐతే ఇది చెప్పడం మొదలుపెట్టు అనే అర్థం కల 'చెప్పబట్టు' ధాతువుకు క్త్వార్థకరూపం. హేత్వర్థంలో వాడబడే 'పట్టి' అనేది మాత్రం అవ్యయం.

షష్ఠీవిభక్తి :

ఇకారంమీద షష్ఠీకువర్ణం 'కి' వర్ణంగా మారుతుంది. కాని కోస్తా వ్యవహారంలో ఇకారేతర అచ్చులమీది కు వర్ణంకూడా 'కి' వర్ణంగా మారడం కనిపిస్తుంది. ఉదా:- మనకి, వాళ్ళకి, పిల్లలకి మొ॥ ఈ రూపాలు న. జి. వ్యవహారంలో కనిపించవు.

నామవాచకాల్లోని డు వర్ణం ప్రథమేతర విభక్తులు పరంగా ఉన్నప్పుడు 'డి' వర్ణంగా మారితే న. జి. లో మాత్రం 'ని' వర్ణంగా మారడం కనిపిస్తుంది.

| కోస్తా | న. జి. |
|---|---|
| వాడికి | వానికి |
| దేవుడికి | దేవునికి |
| అల్లుడికి | అల్లునికి |

సప్తమీవిభక్తి :

i) సప్తమీ విభక్తిలోనూ, నిర్ధారణ షష్ఠిలోనూ వచ్చే 'లో' ప్రత్యయం న. జి. వ్యవహారంలో కొన్ని పదాలపై 'ల' గానూ, కొన్ని శబ్దాలపై 'లె' గానూ మారుతుంది.

ల : ఇంట్ల (ఇంట్లో), హోటల్ల (హోటల్లో)
బాయిల (బావిలో), పుస్తకంల (పుస్తకంలో)
లె : కంట్లె (కంట్లో), గుళ్ళె (గుళ్ళో)
బళ్ళె (బడిలో) ఊర్లె (వాకిట్లో)

వీటి ప్రథమా బహువచన రూపాలకు 'అల్ల' అనేది చేరి సప్తమీ బహువచనరూపాలు ఏర్పడుతాయి.

ఇండ్లల్ల (ఇండ్లల్లో) హోటళ్లల్ల (హోటళ్లల్లో)
బావులల్ల (బావుల్లో) కండ్లల్ల (కళ్లల్లో)
గుళ్లల్ల (గుళ్లల్లో) ఊర్లల్ల (ఊళ్లల్లో)

చెరువు శబ్దానికి సప్తమీ విభక్తిలో ఏ. వ. లో చెర్ల అనీ, బ. వ. లో చెర్లల్ల, చెరువులల్ల అనీ వాడుక ఉంది.

చెర్ల : చెరువు+ల>చెరు+ల> చెర్+ల=చెర్ల
చెర్లల్ల : చెరువులు+అల్ల>చెరు+లు+అల్ల>చెర్+లు+అల్ల=చెర్లల్ల
చెరువులల్ల : చెరువులు+అల్ల=చెరువులల్ల

'లోపల' అనే అర్థంలో 'లోపట' అనే రూపం కూడా వాడుకలో ఉన్నది. 'బయట' శబ్దసాదృశ్యం (anology) తో 'ల'కారం 'ట'కారంగా మారి ఉంటుంది.

పైన పేర్కొన్న విభక్తి ప్రత్యయాలే కాక అయా అర్థాల్లో కింద పేర్కొన్న విభక్తి ప్రతిరూపకాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.

పొంటి/పొంట : ఇవి వెంబడి, వైపు, దిశగా, మీదుగా అన్నే అర్థాల్లో ప్రయోగింపబడతాయి.

ఉదా : దేశాలపొంట, దేశాలపొంటి } దేశాలవెంట

తొావ్వపొంట } తోవవెంబడి / తోవగుండా
తొావ్వపొంటి }

చెంపపొంట } చెంపమీదుగా
చెంపపొంటి }

'మీద' అనే అర్థంలో 'కూరికి' అనే ప్రత్యయం కనిపిస్తుంది. ఐతే ఇది 'కొట్టడ'మనే అర్థం కలిగిన క్రియాపదం వాడబడి నప్పుడే అవయవ వాచకాల మీద మాత్రమే రావడం గమనించదగ్గ అంశం.

ఉదా : చెంపకూరికి (చెంపమీద) నాలుగు వేస్తె దౌడపండ్లు రాలాలె.

పీపుకూరికి (పీపుమీద) నాలుగు వెయ్యి.

గుంట : ఇది గుండా, ద్వారా అనే అర్థాల్లో చేరుతుంది.

ఉదా : దిడ్డిగుంట (దిడ్డిగుండా)
కిటికిగుంట (కిటికిగుండా)
చేతిగుంట (చేతిగుండా)

కాడ : 'కడ'కు వికృతి రూపమైన ఈ 'కాడ' దగ్గర, సమీపం అనే అర్థాల్లో చేరుతుంది.

ఉదా:- గుడికాడ, బడికాడ, రోడ్డుకాడ

నామవాచకం మీద చేరిన ఈ 'కడ' మీద పంచమీ విభక్తి ప్రత్యయమైన నుంచి, షష్ఠి విభక్తి ప్రత్యయమైన 'కు' ప్రత్యయాలు చేరుతాయి.

కడపై 'నుంచి' చేరినపుడు అది క్రమంగా 'కాంచి' అని మారుతుంది. ఉదా :- గుడికాంచి (గుడికడ+నుంచి) బడికాంచి (బడికడ+నుంచి) వీటికి గుడిదగ్గర నుండి, బడి దగ్గరనుండి అని అర్థం. ఈ అర్థంలో 'కాంచెల్లి' అనే రూపం కూడా వ్యవహారంలో ఉన్నది. ఉదా :- గుడికాంచెల్లి బడికాంచెల్లి, ~~ఇంటికాం~~చెలి మొ॥

కడపై షష్ఠీ విభక్తి చేరినప్పుడు 'కాడికి' అనే రూపం ఏర్పడుతుంది.

గుడికాడికి     బడికాడికి     రోడ్డుకాడికి

'దిశగా' అనే అర్థంలో ముంగల, వెనుక, ముందల, పై, కింద మొదలైన శబ్దాలపై 'ంగ' అనేది ఆగమంగా చేరుతుంది.

ఉదా:- ముంగలంగ, వెనుకంగ, ముందలంగ, పైంగ, కిందంగ, పక్కంగ మొ॥

కడ అనేదానికి కాడ, తావున అనేదానికి తాన అనేవి వికృత రూపాలు ఇవి దగ్గర అనే అర్థంలో చేరుతాయి.

కాడ : బడికాడ, గుడికాడ, దుకాణంకాడ మొ॥

తాన : నాతాన, అందరితాన, అన్నతాన మొ॥

ఈ రెండు శబ్దాలు తద్ధర్మార్థక విశేషణాలపై కూడా చేరుతవి.

ఉదా :

ఇచ్చేకాడ, తీసుకునేకాడ }
ఇచ్చేతాన, తీసుకునేతాన } ఇచ్చేదగ్గర, తీసుకునేదగ్గర అని అర్థం.

భావార్థకాలు :

i) ధాతువుపై అటం, అడం ప్రత్యయాలుచేరి ఏర్పడిన చేయటం, చేయడం మొదలైన భావార్థక రూపాలు తెలుగుదేశమంతటా వ్యవహారంలో ఉన్నాయి. వీటితో పాటు డు, కం అనే ప్రత్యయాలు చేరి ఏర్పడ్డ భావార్థక రూపాలు కూడా న. జి. వ్యవహారంలో ఉన్నాయి.

ఉదా :

| | | | | |
|---|---|---|---|---|
| డు : | తినుడు | తాగుడు | పోవుడు | వచ్చుడు |
| | చదువుడు | రాసుడు | దున్నుడు | ఆడుడు |
| కం : | తినుకం | తాగుకం | పోవుకం | వచ్చుకం |
| | చదువుకం | రాసుకం | దున్నుకం | ఆడుకం |

'డు' కం ప్రత్యయాలు చేరిన భావార్థక రూపాలు ఏర్పడే పద్ధతి కోస్తా వ్యవహారంలో కూడా ఉన్నా అది తాగుడు, అమ్మకం మొదలైన కొన్ని పదాల్లో మాత్రమే పరిమితంగా కనిపిస్తుంది. ఐతే ఈ రూపాల్లో 'కం' ప్రత్యయం పరంగా ఉన్నప్పుడు ధాతువు చివరి ఉకారం అకారంగా మారడం కోస్తా రూపాల్లో విశేషం. న.జి. వ్యవహారంలో ప్రతి ధాతువుపై ఈ ప్రత్యయాలు చేరిన భావార్థక రూపాలు కనిపిస్తాయి.

ii) ధాతువుపై 'ఏది' అనే పదం చేరి భావార్థకాలు ఏర్పడడం కూడా కనిపిస్తుంది.

ఉదా : చదివేది ఉందా, లేదా? (చదువడం ఉందా, లేదా?)

ఎప్పుడు తినేదే. మరో పనిలేదు. (ఎప్పుడు తినడమే. మరో పనిలేదు.)

## పదజాలం

ధ్వని పరిణామాలు, వ్యాకరణ విశేషాలు మొదలైన అంశాల్లోనే కాక పదజాలంలోనూ మాండలికత ఉంటుంది. అన్య భాషా పదాల ప్రయోగం, ఒక ప్రాంతంలో ఒక అర్థంలో వాడే పదాన్ని మరో ప్రాంతంలో మరో అర్థంలో వాడడం, ఒక ప్రాంతంలో ఒక అర్థంలో ఒక పదాన్ని వాడితే మరో ప్రాంతంలో వేరే పదాన్ని వాడడం, ఒకే పదాన్ని భిన్న ప్రాంతాల్లో కొద్ది మార్పుతో ఉచ్చరించడం ఇవన్నీ పదజాలానికి సంబంధించిన మాండలికతా లక్షణాలు. న. జి. ప్రాంతంలోని పదజాలానికి సంబంధించిన మాండలికతా విశేషాలను పరిశీలిద్దాం.

**అన్యదేశ్యాలు :** ప్రతిభాషా తనకు సరమైన పదజాలాన్ని ఇతర భాషలనుండి గ్రహించినప్పుడే సంపన్నం కాగలుగుతుంది. వివిధ

భావాలనూ వ్యక్తం చేయగలుగుతుంది. ఇతర భాషలనుండి పద జాలాన్ని గ్రహించకుండా మడిగట్టుకున్న భాష ఉండనే ఉండదన్నా అతిశయోక్తి కాదు. మనం వాడే కొన్ని అన్యదేశ్య పదాలకు సరైన దేశ్య శబ్దాలేమిటో మనకు తెలియకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. అసలు అనే ఉర్దూ మాటకు సిసలైన తెలుగుమాట దొరకదు. తాజా, ఫర్వా మొదలైన పదాలకు మంచి తెలుగు మాటలు వెంటనే మనకు తోచవు కదా! రోజు అనేది ఉర్దూ పదమైనా నే దది తెలుగు, సంస్కృత పదాలను తలదన్ని చెలామణిలో స్థిరపడింది. ఈనాడు మనం ఆంగ్లభాషలో సమస్త సాంకేతిక విషయాలను చెప్ప గలుగుతున్నామంటే అది గ్రీక్, లాటిన్ మొదలైన అనేక భాషల నుండి పదజాలాన్ని గ్రహించడం వల్లనే. **verandah, bangle, carpet, pillow, kitchen, kangaroo, university** మొదలైనవి ఆంగ్లపదాలు కావు. ఆంగ్లంలో చేరిన ఇతర భాషా పదాలు. తెలుగులో సంస్కృతం, అరబిక్, పర్షియన్, ఉర్దూ, మరాఠీ, కన్నడం మొదలైన ఎన్నో భాషల పదాలు చేరినాయి. తెలుగు వ్యాకర్తలు ఆంగ్లాది పదాలను మాత్రమే అన్యదేశ్యాలుగా పరిగణించినారు కాని సంస్కృత పదాలను అన్యదేశ్యాలుగా పరిగణించలేదు. చదువుకున్న శిష్టుల వ్యవహారంలోనూ, రచనల్లోనూ సంస్కృత పదాలు చోటు చేసుకోవ డంలో విశేషం లేదు. కాని న.జి. లో పామరులైన జానపదుల్లో కూడా ఎన్నో చక్కని సంస్కృత పదాలు, సంస్కృత పదబంధాలు - కొన్ని యథాతథంగానూ, కొన్ని కొద్ది మార్పుతోనూ వాడుకలో ఉండడం గమనించదగ్గ అంశం. మానరకు కొన్ని ఉదాహరణలు.

సాంతం - రక్త మండలం - రణం (వ్రణం), సుతి (శ్రుతి), నాశనగాలం (నాశనకాలం) బౌగ (బహుగ) గౌరత (గౌరవం) శమ ధర్మం. మా (మహా) విదాయకం (విధాయకం) నిష్టూరం (నిష్ఠురం) శాద్ధి (శపథం) గనం (ఘనం) సాత్కం (సార్థకం) వతి (గ) (వత్= వలె) కుతార్తం (కృతార్థం) అన్యాలం (అన్యాయం) పర్యంతరం

(పర్యంతం) తప్పరి, తత్పరి (తదుపరి) సకిలం ముకిలం (సకలం ముకుళం) బేస్తవారం (బృహస్పతి వారం) ఇసపాతకుడు (విష పాతకుడు).

**ఉర్దూపదాలు :**

సంస్కృత పదాల మాదిరిగానే ఉర్దూ పదాలు కూడా న.జి. వ్యవహారంలో అత్యధిక సంఖ్యలో కనిపిస్తాయి. చాలాకాలం తెలంగాణా ప్రాంతం మహమ్మదీయ రాజుల అధికారంలో ఉండటంతో పాటు ఉర్దూ అధికార భాషగా ఉండడం మొ॥లైనవి దీనికి కారణాలు. ఉర్దూ భాషనుండి నామవాచకాలు, అవ్యయాలు, క్రియాపదాలు మొదలైన శబ్దజాలం తెలుగులో గ్రహింపబడింది. వీటిలో క్రియాపదాలు కొంత విలక్షణంగా ఉంటాయి. ఉర్దూ ధాతువుకు 'ఆయించు' అనేది చేరి ఈ క్రింది క్రియాపదాలు ఏర్పడుతవి. న.జి. వ్యవహారంలో కనిపిస్తున్న ఉర్దూ క్రియాపదాలు ఇవి :

| | | | |
|---|---|---|---|
| అట్టాయించు | ఉడాయించు | కటాయించు | కమాయించు |
| కులాయించు | గుజ్రాయించు | గుసాయించు | గెరాయించు |
| చిడాయించు | చుటాయించు | చెపాయించు | చెమ్గాయించు |
| చెలాయించు | జమాయించు | జీతాయించు | జుడాయించు |
| టికాయించు | తలాయించు | దబాయించు | దక్లాయించు |
| తలాయించు | థకాయించు | దబాయించు | దటాయించు |
| నిభాయించు | పసాయించు | బజాయించు | బడాయించు |
| పోంచాయించు | పిలాయించు | పస్తాయించు | బైతాయించు |
| బద్లాయించు | బచాయించు | బిగ్డాయించు | ఫిరాయించు |
| బజాయించు | బనాయించు | బిగ్డాయించు | భగాయించు |
| మిలాయించు | రొకాయించు | లగాయించు | లట్కాయించు |
| సతాయించు | సట్కాయించు | సమ్జాయించు | సమ్లాయించు |
| సుల్జాయించు | సుదరాయించు | సోంచాయించు | రగ్డాయించు |

ఈ క్రియాపదాలు చాలావరకు తెలంగాణ మంతటా వ్యవహారంలో ఉన్నాయి.

ఉర్దూ ప్రభావంతో కొన్ని వింత పలుబడులు - తెలుగు వ్యవహారానికి విరుద్ధమైనవి - న. జి. వ్యవహారంలో కనిపిస్తాయి. ఉదాహరణకు 'చా తాగిస్తారా' అన్న వాక్యం తీసుకోండి. తాగడానికి శక్యంకాని సందర్భంలో మరో వ్యక్తి తాగడానికి సహాయపడినప్పుడే తాగించడమనే ప్రేరణార్థక క్రియ వాడడం తెలుగుభాషావ్యవహారానికి సహజం. కాని ఇక్కడ టీ ఇప్పిస్తారా? అని అర్థం. ఇప్పించడమనే అర్థంలో తెలుగులో ఈ విధమైన వ్యవహారానికి ఉర్దూలోని చాయ్ పిలాతే క్యా? అనే వ్యవహార ప్రభావమే కారణం. అట్లాగే 'నేను చెప్పేది ఇది గదాంటె' అనే ప్రయోగానికి 'మై బోల్‌నా యహ హైకి' అనే ఉర్దూ వ్యవహారమే మూలం.

**దేశ్యపదాలు :**

రాజకీయ, చారిత్రిక, సాంఘికాది కారణాల వల్ల న. జి. భాషలో ఉర్దూపదాలు ఎక్కువ సంఖ్యలో చేరినా చేవగలిగిన చక్కని దేశ్యపదాలు ఈ జిల్లా వాడుక భాషలో ఎన్నో కనిపిస్తాయి. జానపదుల నోళ్ళలో నిత్యమూ నలిగే ఈ పదాలకు నాగరులు నిఘంటువుల్లో అర్థాలను వెదుక్కోవలసి వస్తుంది. కొన్నింటిని దిగువ ఉదాహరిస్తాను.

కొర్రాకు (<కొరకచ్చు; కొఱవి)
సంచకారి (<సంచకరువు, advance)
బొండిగ/బొండిగె (<బొండుగ=కంఠం)
తలపాలు (పుట్టి; 'నీ తలపాలు పగుల' అని తిట్టు)
తల (=సమయం, చావుదల పోదల మొ॥
నెనరు (ప్రేమ)

ఇడుపులు (ఇంటిద్వారానికి ఇరువైపులఉండే గోడలు)
గదువ (<గద్దువ చిబుకం)
దీలి పండుగ (దివ్వెల పండుగ)
ఒడిసిపోవు (<వడిసిపోవు> కారిపోవు).

**అర్థాంతరంలో వాడుకునే పదాలు :**

ఒకే పదం వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు అర్థాల్లో వాడబడటం. కూడా మాండలికతా లక్షణాల్లో ఒకటి. ఈ లక్షణం ఉన్న పదాలు కొన్ని.

| న. జి. | కోస్తా |
|---|---|
| బొక్క (ఎముక) | రంధ్రం |
| గడ్డం (ముఖంమీద మొలిచే వెంట్రుకలు) | చిబుకం |
| తీర్మానం (నిదానం, నిర్ణయం) | నిర్ణయం |
| అంగడి (సంత) | దుకాణం, కొట్టు |

**ఒకే అర్థంలో భిన్నపదాలు వాడడం :**

ఒక ప్రాంతంలో ఒక అర్థంలో ఒక పదాన్ని వాడితే మరో ప్రాంతంలో అదే అర్థంతో మరో పదం వాడడం కూడా మాండలికతా లక్షణమే. కోస్తా, న. జి. ప్రాంతాల్లోనూ ఈ లక్షణం ఉన్న పదాలను ఎన్నింటినో ఉదాహరించవచ్చు. మానరకు కొన్ని—

**నామవాచకాలు :**

| న. జి. | కోస్తా |
|---|---|
| మానర | మచ్చు |
| అట్ర | గది |
| అన్గపుకాయ | సొరకాయ |

| | |
|---|---|
| అవుసలి | కంసాలి |
| ఏరాలు | తోడికోడలు |
| గోకరకాయ | గోరుచిక్కుడు |
| పుంటికూర | గోంగూర |
| గలుమ | గుమ్మం |
| గ్యాస్‌నూనె | కిరసనాయిలు |
| తంతె | మెట్టు |
| తొక్కు | పచ్చడి |
| దూప | దాహం |
| వెయ్యి | ఒళ్ళు |
| మొగురంగడ్డ | రత్నపురిగడ్డ |
| బొక్క | ఎముక |
| మొల | మేకు |
| బిడ్డ | కూతురు |

క్రియాపదాలు :

| | |
|---|---|
| ఏంచు | లెక్కించు |
| ఒడిసిపోవు | ఐపోవు, మిగలకుండాపోవు |
| కక్కు | వాంతి చేసుకొను |
| ఊకు | చిమ్ము |
| ఉరుకు | పరుగెత్తు |
| ఎచ్చబెట్టు | వేడిచేయు |

అవ్యయాలు :

| | |
|---|---|
| లెక్క | (మాదిరిగా) |
| అప్పుడు | (సమయంలో) |
| గట్ల/ | |
| గిట్ల/గిన | |
| అన్న/ఐనా/కాని | |

'నేను గనుక' 'నువ్వు గనుక' మొదలైన చోట్ల కోస్తా వాడుకలో ఉన్న 'కనుక' అనే పదానికి బదులుగా న. జి. వాడుకలో 'కాంక' అనే పదం కనిపిస్తుంది. కనుక వికృతి రూపమే కాంక.

నేను గాంక ఈ పని చేసినాను.
నువ్వు గాంక ఈ పని చేసినవ్.

పై శబ్దాల్లో 'అప్పుడు' అనే క్రియా విశేషణం సాధారణంగా సమయార్థంలో క్రియాజన్య విశేషణాలపై చేరుతుంది.

ఉదా : వస్తున్నప్పుడు వచ్చినప్పుడు వచ్చేప్పుడు

కాని న. జి. వాడుకలో నామవాచకాలపై కూడా సమయం, సందర్భం అనే అర్థంలో చేరడం కనిపిస్తుంది.

ఉదా : పండుగప్పుడు (పండుగ సమయంలో)
నాట్లప్పుడు (నాట్ల సమయంలో)
కోతలప్పుడు (కోతల సమయంలో)

ఇంగ్లీషులోని 'either - or' అనే శబ్దార్థంలో కోస్తాలో 'ఐనా' అనే పదం వాడుకలో ఉంది. ఉదా : నేనైనా, నువ్వైనా మొ॥ న.జి.లో 'ఐనా' అనే శబ్దంతో పాటు 'అన్న' అనే రూపం కూడా వాడుకలో కనిపిస్తుంది.

ఉదా : నేనన్న, నువ్వన్న (నేనైనా, నువ్వైనా)
రైలుకన్న, బస్సుకన్న (రైలుకైనా, బస్సుకైనా)

న. జి. వాడుక భాషలో అతి ప్రచురంగా వినబడే మాటలు గిట్ల, గట్ల, గిన అనేవి. ఇవి అనిశ్చితార్థంలో నామవాచకాల మీదా, చేదర్థకం మీదా చేరుతాయి.

ఉదా : అయన గిట్ల/గట్ల/గిన వస్తే నీ సంగతి తెలుస్తది.
అయన వస్తె గిట్ల/గిన చూద్దాంలే.
వస్తెనన్న లేదు (వస్తునైనా లేదు.)
చెప్తెనన్న (చెప్తేనైనా)

**ఒకే పదాన్ని భిన్నంగా ఉచ్చరించడం :**

| | |
|---|---|
| పెండ | పేడ |
| అంట (కిలార్థకం) | అట |
| తాంబేలు | తాబేలు |
| మామ | మావ్ |
| పేపర్ | ఫేపర్ |

ఈ విధంగా న. జి. పదజాలానికి సంబంధించిన మాండలికతావిశేషాలనెన్నింటినో మనం గమనించవచ్చు.

**ఇవార్థకాలు :**

ఇవార్థంలో లా, లాగా, మాదిరిగా మొదలైన రూపాలు కోస్తా వాడుకలో ఉన్నాయి. న.జి. లో ఓత్లే, ఓలిగె, లెక్క, ఓతిగ, ఓతిగె, వతిగ అనే రూపాలు కనిపిస్తవి.

| | |
|---|---|
| ఓలె/ఓలిగ/ఓలిగె | : ఆయనోలె, ఆయనోలిగ, ఆయనోలిగె |
| ఓతిగ/ఓతిగె | : ఆయనోతిగ, ఆయనోతిగె |
| వతిగ | : ఆయనవతిగ |
| లెక్క | : ఆయనలెక్క |

వీటిలో ఓలె, ఓలిగ / ఓలిగె అనేవి వలె, పోలె అనే రూపాలకూ, ఓతిగ / వతిగ అనేవి వత్ (రామవత్, కృష్ణవత్ మొ॥) అనే సంస్కృత ఇవార్థకానికీ వికృతులు కావచ్చు.

**సమీపార్థకాలు :**

న. జి. వాడుకలో దగ్గర అనే అర్థంలో కాడ, అనేది జడవాచకాల పైనా, తాన అనేది మనుష్య వాచకాల పైనా చేరడం గమనించదగ్గ అంశం. కాడ అనేది కడకు, 'తాన' అనేది 'తావు'నకు వికృతరూపాలు. ఈ ప్రయోగాలు రాయలసీమ వ్యవహారంలో కూడా ఉన్నాయి.

iii) నుజ్యంత రూపాలు కూడా కొన్ని సందర్భాల్లో భావార్థ కాలుగా ప్రయోగింపబడుతున్నాయి. ఐతే వీటికి జంటగానే ప్రయోగం ఉంటుంది.

1. తినను, తిరుగను అంతే. వానికి మరో పని లేదు.
(తినడం, తిరగడం అంతే. వానికి మరో పని లేదు.)
2. డబ్బు సంపాదించను. ఖర్చుపెట్టను. అంతే వాని పని.
(డబ్బు సంపాదించడం, ఖర్చుపెట్టడం అంతే వాని పని.)

కిలార్థకాలు :

న. జి. లో 'అట' అనే రూపంతో పాటు 'అంట' అనే రూపం కూడా కిలార్థంలో వాడబడుతుంది.

ఉదా:- పోయిందంట, వచ్చిందంట మొ॥

అవధ్యర్థకాలు :

అవధ్యర్థంలో 'దాక' అనే శబ్దంతోపాటు దాంక, దన్క, దాన్క అనే రూపాలు వాడుకలో ఉన్నాయి.

దాంక : బి.ఏ. దాంక దన్క : బి.ఏ. దన్క దాన్క : బి.ఏ. దాన్క
వచ్చిందాంక వచ్చిందన్క వచ్చిందాన్క

ఒక క్రియకు సంబంధించిన కాల విషయకమైన అవధిని తెలియజేయడానికి సాధారణంగా తద్ధర్మార్థక విశేషణాలపై 'సరికి' 'అప్పటికి' అనేవి చేరుతాయి. ఉదా:- వచ్చేసరికి, వచ్చేప్పటికి మొ॥ న. జి. వ్యవహారంలో వీటితో పాటు తలకు/తలికి అనేవి కూడా కనిపిస్తాయి.

ఉదా:- వచ్చేతలకు/వచ్చేతలికి
పొయ్యేతలకు/పొయ్యేతలికి

ఈ రూపాల్లో తలకు, తలికి అనేవి పరంగా ఉన్నప్పుడు తద్ధర్మార్థక విశేషణాల్లోని చివరి దీర్ఘం హ్రస్వంగా మారింది.

సాధారణంగా న. జి. వాడుకలో తద్ధర్మార్థకవిశేషణంలోని చివరి దీర్ఘం హ్రస్వంగా మారడం గమనించాలె. ఉదా:- వచ్చెటప్పుడు, వచ్చెసరికి, వచ్చెటోళ్ళు, వచ్చెటందుకు మొ॥

ప్రాచీనభాషలో 'తల' అనే పదానికి సమయం అనే అర్థం ఉన్నది. 'రాక తల నాకలి దేర్చెద' అని భాస్కర రామాయణ ప్రయోగం. ఆధునిక వ్యవహారంలో కూడా చావుదల, పోదల మొదలైన పదాల్లో 'తల' సమయార్థంలో కనిపిస్తుంది. వచ్చెతలకు, వచ్చెతలికి మొ॥ ప్రయోగాల్లోనిది ఈ 'తల'యే ఐఉంటుంది.

రాత్రి, పొద్దటి, మాపటి అనే శబ్దాలపై సమయార్థకమైన ఈ 'తల' చేరినపుడు పూర్ణబిందువు ఆగమంగా రావడం కనిపిస్తుంది.

ఉదా:- రాత్రింతల (రాత్రి+తల) రాత్రి సమయాన
పొద్దటింతల (పొద్దటి+తల) పొద్దటి సమయాన
మాపటింతల (మాపటి+తల) మాపటి సమయాన

ఈ అర్థాల్లో రాత్రి, పొద్దటి, మాపటి శబ్దాలపై 'ఈలి' అనేది చేరడం కూడా ఉన్నది.

ఉదా:- రాత్రీలి (రాత్రివేళ>రాత్రేళ>రాత్రేల>రాత్రీలి)
పొద్దటీలి (పొద్దటివేళ>పొద్దటేళ>పొద్దటేల>పొద్దటీలి)
మాపటీలి (మాపటివేళ>మాపటేళ>మాపటేల>మాపటీలి)

**ధ్వన్యాద్యనుకరణ వాచకాలు :**

ఒక భావాన్ని శక్తిమంతంగా వ్యక్తం చేయడానికి అనుకరణ శబ్దాలు ఎంతగానో సహకరిస్తాయి. చిన్నయసూరి వీటిని ధ్వన్యనుకరణ వాచకాలని పేర్కొన్నాడు. ఐతే ఇవి కేవలం ధ్వనిని మాత్రమే అనుకరించేవి కావు. కాంతి, త్వర మొదలైన ఎన్నో భావాలను అనుకరిస్తాయి కనుక వీటిని ధ్వన్యాద్యనుకరణ శబ్దాలని పేర్కొవడం సమంజసం.

ఇతర ప్రయోగాల్లో మాదిరిగానే న.జి. వ్యవహారంలో 'అను కరణ' పదాల్లో కూడా విలక్షణత కనిపిస్తుంది. కోస్తా వ్యవహారంలో లేని ఎన్నో క్రొత్త అనుకరణ పదాలు న.జి. వ్యవహారంలో కనిపిస్తున్నాయి. ఆయా అర్థాల్లో ప్రయోగింపబడే అనుకరణవాచక పదాలను దిగువ ఉదహరిస్తున్నాను.

కట్న / జెట్టజెట్ట - జెటజెట - జెట్న - జెపజెప - జెప్పున / తటతట - తట్న / పుసపుస - పుస్సున / గొరగొర (లాగడం) / గరగర / పల్లపల్ల (కొట్టడం) బిరబిర / బిర్న / ములముల / రప్పున / సరసర-సర్న / లప్పలప్ప (తినడం)/వలవల (ఏడ్వడం); సట సట - సట్న - సటుక్కున / మంయ మంయ (తొందరలో త్వరాసూచకం); కయ్యి - కయ్యి (అరవడం);

**పరిమాణార్థకాలు :**

'అంత' అనే పరిమాణార్థక వాచకం నామవాచకాలపై చేరడం అన్ని ప్రాంతాల వ్యవహారంలో కనిపిస్తుంది. ఉదా : ముత్తెమంత మొ॥నవి. కాని న.జి. వ్యవహారంలో కొద్దిగ, కొంచెము అనే పదాలపై కూడా చేరడం కనిపిస్తుంది. ఉదా : కొద్దిగంత, కొంచెమంత మొ॥

## క్రియారూపాలు

**సమాపక క్రియారూపాలు :**

కోస్తాప్రాంతం వాడుకలోనూ, న. జి. వాడుకలోనూ కనిపించే వివిధ కాలాలకు సంబంధించిన క్రియాపదాలు దిగువ చూపబడు తున్నాయి. వీటిని పోల్చి చూచినప్పుడు న. జి. వాడుకలో ఉన్న క్రియాపదాల విలక్షణతను స్పష్టంగా గుర్తించవచ్చు.

వర్తమానార్థకాలు :

మహదర్థం.

| | న. జి. | | కోస్తా | |
|---|---|---|---|---|
| | ఏ. వ. | బ. వ. | ఏ. వ. | బ. వ. |
| ప్ర. పు. | వస్తున్నడు<br>వస్తుండు | వస్తున్నరు<br>వస్తున్రు | వస్తున్నాడు | వస్తున్నారు |
| మ. పు. | వస్తున్న(వ్)వు | వస్తున్నరు | వస్తున్నా(వ్) | వస్తున్నారు |
| ఉ. పు. | వస్తున్న | వస్తున్నం | వస్తున్నా | వస్తున్నాం |

అమహదర్థం :

| | | | | |
|---|---|---|---|---|
| ప్ర. పు. | వస్తున్నది<br>వస్తుంది | వస్తున్నయ్ | వస్తుంది | వస్తున్నాయి |

వర్తమానార్థక క్రియారూపాల్లో ధాతువుపై చేరిన ఉన్నాను బంధంలోని దీర్ఘం హ్రస్వం కావడం న. జి. వాడుకలో ప్రధానంగా కానవచ్చే లక్షణం. వస్తున్నాడు మొదలైన ఉన్నానుబంధం దీర్ఘాంతంగా ఉన్న రూపాలుకూడా న. జి. వాడుకలో లేకపోలేదు. ఐతే వాటికి కొన్ని నియమితమైన అర్థవిశేషాల్లో మాత్రమే ప్రయోగం కనిపిస్తుంది.

వస్తున్నాడు! ఆయన సంగతి చెప్త.
పోతున్నాడు! ఆయనకేం గతి పడ్తదో చూస్త.

పై వాక్యాల్లోని వచ్చినాడు, పోయినాడు అనే క్రియాపదాల్లో నకారంమీది ఆకారాన్ని కాకుస్వరంతో ఉచ్చరించడంవల్ల సంభావనార్థంతోపాటు కర్తయొక్క ఆయా క్రియల విషయంలో కల అనిష్టత కూడా వ్యక్తమౌతుంది.

వర్తమానార్థంలో మహత్ ప్ర. పు. ఏకవచనంలో వస్తుండు, బహువచనంలో వస్తున్రు అనే రూపాలు న.జి.లో వాడుకలో ఉన్నాయి.

ఈ రూపాల్లో ఉన్నానుబంధంలోని నకార ద్విత్వమూ, అకారమూ లోపించడం ఈ రూపాల్లో జరిగిన పరిణామం.

వస్తు+న్న+అడు>వస్తు+న్న+అడు>వస్తున్+డు= వస్తుండు
వస్తు+న్న+ఆరు>వస్తు+న్న+అరు>వస్తున్+రు=వస్తున్రు

కోస్తా వాడుకలోని 'వస్తుంది'లో జరిగిన అకార లోప పరిణామమే న. జి వాడుకలోని 'వస్తుండు', 'వస్తున్రు' రూపాల్లో కూడా జరిగింది. ఉండు ధాతువుకు వర్తమానార్థంలో ప్ర.పు. ఏకవచనంలో ఉండు (ఉన్నాడు అని అర్థం) అనే రూపం కూడా ఈ విధంగా ఏర్పడ్డదే.

వర్తమానార్థక అమహదర్థక క్రియల్లో ప్ర.పు. ఏకవచనంలో వస్తున్నది, వస్తుంది అనే రెండు రూపాలకూ వాడుక ఉన్నా 'వస్తున్నది'కే ఎక్కువ వాడుక. కోస్తా ప్రాంతంలో 'వస్తుంది'కి తప్ప 'వస్తున్నది'కి వాడుక లేదు. వస్తుంది అనే రూపం తద్ధర్మ, భవిష్యదర్థాల్లో కూడా వాడబడుతుంది.

కాకువువల్ల అర్థవిశేషం సూచింపబడుతున్నప్పుడు అమహదర్థంలోనూ దీర్ఘాంతమైన ఉన్నానుబంధ రూపాలకు వాడుక ఉన్నది.

వస్తున్నాది! వస్తున్నాయి!

**భూతార్థక క్రియలు :**

మహదర్థం-

| | న. జి. | | కోస్తా | |
|---|---|---|---|---|
| | ఏ.వ. | బ.వ. | ఏ.వ. | బ.వ. |
| ప్ర.పు. | వచ్చిండు | వచ్చిన్రు | వచ్చాడు | వచ్చారు |
| | వచ్చినాడు | వచ్చినారు | | |
| | వచ్చె | వచ్చిరి | | |

| | | | | |
|---|---|---|---|---|
| మ.పు. | వచ్చినవ్<br>వచ్చినావు<br>వస్తివి | వచ్చిన్రు<br>వచ్చినారు<br>వస్తిరి | వచ్చావు | వచ్చారు |
| ఉ.పు. | వచ్చిన<br>వచ్చినాను<br>వస్తి | వచ్చినం<br>వచ్చినాం<br>వస్తిమి | వచ్చాను | వచ్చాం |
| అమహద్ధర్మం | వచ్చింది<br>వచ్చె | వచ్చినయ్<br>వచ్చినాయ్<br>వచ్చినాయి | వచ్చింది | వచ్చాయి |

భూతార్థక మహత్ప్రథమ పురుషైక వచనంలో కోస్తా జిల్లా వాడుకలో ఉన్న 'వచ్చాడు' అనే రూపమూ, న.జి. వాడుకలో ఉన్న 'వచ్చిండు' అనే రూపమూ 'వచ్చినాడు' అనే రూపంనుండి ఏర్పడ్డవే. న.జి. వాడుకలో వచ్చినాడు, వచ్చినడుగా మారి, నకారం మీది అకారం లోపించి 'వచ్చిండు' అనే రూపం ఏర్పడితే కోస్తా వాడుకలో వచ్చినాడులో నకారం లోపించి 'వచ్చాడు' ఏర్పడింది.

వచ్చి+న్+ఆడు > వచ్చి+న్+అడు>వచ్చి + న్ + డు
= వచ్చిండు
వచ్చి + న్ + ఆడు > వచ్చి + ఆడు = వచ్చాడు

'వచ్చినది' లో నకారంమీది అకారం లోపించి 'వచ్చింది' ఐనట్లుగానే 'వచ్చినడు' లో అకారం లోపించి 'వచ్చిండు' ఐనదన్నమాట.

భూతార్థక మహత్క్రియ లన్నింటిలోనూ కోస్తా ప్రాంత వ్యవహారంలో నకారం లోపించడం, న.జి. వ్యవహారంలో లోపించక పోవడం కనిపిస్తుంది నకారం లోపించకపోవడమేకాక ప్ర.పు. లో

నకారం మీది అకారం లోపించడం, మధ్యమ పురుషలోనూ (బహు వచనం తప్ప) ఉత్తమ పురుషలోనూ నకారంమీది దీర్ఘం హ్రస్వం కావడం న.జి. వ్యవహారంలో కనబడే విలక్షణతలు. వచ్చినాడు, వచ్చినారు మొదలైన భూతార్థక మహద్రూపాలు అన్ని పురుషల్లోనూ న.జి. వ్యవహారంలో కనిపిస్తాయి. కాకువుచే అర్థ విశేషం సూచింప బడినప్పుడు వీటి వాడుక ఎక్కువగా కనిపిస్తుంది.

అట్లాగే కోస్తా ప్రాంతం వ్యవహారంలో లేని వచ్చె, వచ్చిరి, వస్తివి, వస్తిరి, వస్తిని, వస్తిమి అనే భూతార్థక క్రియలు కూడా న.జి. వ్యవహారంలో ఉన్నాయి. ఐతే వీటికి అర్థవిశేషాల్లో ప్రయోగం ఉండడం గమనించదగ్గ అంశం.

క్త్వార్థంపై ఉండు ధాతువు భూతార్థక రూపాలు చేరి ఏర్పడిన భూతార్థక రూపాలు న.జి. వ్యవహారంలో కనిపిస్తాయి. ఈ రూపాల్లో పర్యాయంగా పూర్వ రూప సంధి, నకారాగమం రావడం గమనించ వలసిన అంశాలు.

i) వచ్చిందె (వచ్చి+ఉందె) వచ్చిందిరి (వచ్చి+ఉందిరి)

ii) వచ్చినుందె (వచ్చి + ఉందె) వచ్చిందిరి (వచ్చి+ఉందిరి)

శత్రర్థకంపై ఉందె, ఉందిరి మొదలైన ఉండు ధాతువు భూతార్థక రూపాలు చేరి ఏర్పడిన చేస్తుందె, చేస్తుందిరి మొ॥ రూపాలు చేస్తూ ఉండినాడు, చేస్తూ ఉండినారు మొదలైన అర్థాలతోపాటు చేసి ఉండేవాడు, చేసి ఉండేవారు మొదలైన అర్థాల్లో కూడా ప్రయోగింప బడడం న.జి.లో కనిపిస్తుంది.

1. నువ్వు ముందు అగిగింటె అయన ఉద్యోగం ఇప్పిస్తుందె (ఇప్పించి ఉండేవాడు)

2. ముందు చెప్పింటె ఆ పని నేను చేస్తుంటి (చేసి ఉండేవాణ్ణి)
3. బాగా చదివింటె ఫస్టుక్లాసుల వస్తుంటివి(వచ్చి ఉండేవాడివి)

నుజ్యంతమైన ధాతువుపై 'వచ్చు' అనే తద్ధర్మార్థక క్రియా రూపం చేరి ఏర్పడ్డ చెయ్యొచ్చు, పోవచ్చు, రాయొచ్చు మొదలైన రూపాలకు అనుమత్యాద్యర్థాల్లోనే కాక చేసిఉంటాడు/చేసిఉంటుంది మొదలైన భూతార్థాల్లో కూడా వాడుక కనిపిస్తుంది

1. ఆయన ఇప్పటికి పది పుస్తకాలు రాయొచ్చు.
   (ఆయన ఇప్పటికి పది పుస్తకాలు రాసిఉంటాడు.)
2. ఆయన ఇప్పటికి కోట్లు సంపాదించొచ్చు.
   (ఆయన ఇప్పటికి కోట్లు సంపాదించిఉంటాడు)

**సంభావనార్థకాలు :**

నుజ్యంత క్రియారూపంపై 'కల' అనుబంధంచేరి రాగలడు మొ॥ సంభావనార్థకాలు ఏర్పడడం ఆంధ్రదేశం అన్ని ప్రాంతాల్లో ఉన్నా న. జి. వ్యవహారంలో ప్రథమ పురుషైక వచన ప్రత్యయం లోపించడం విశేషం.

వాడు రాగల, వాడు తినగల, వాడు కొట్టగల

వీటికి క్రమంగా వాడు వస్తాడేమొ, వాడు తింటాడేమొ, వాడు కొడతాడేమొ అనే సంభావనార్థం ఉంది.

ఈ రూపాల్లో 'గ' కారం మీది అకారం దీర్ఘంగా మారిన రూపాలు కూడా వాడుకలో ఉన్నాయి.

ఉదా:- రాగాల, తినగాల, కొట్టగాల మొ॥

ఈ అర్థంలో నుజ్యంతంపై 'దిక్క' అనే పదం చేరిన రూపాలు కూడా న జి. వాడుకలో కనిపిస్తాయి.

ఉదా : రాదిక్క, పోదిక్క, కొట్టదిక్క, పడదిక్క మొ॥

భవిష్యదర్థక క్రియలు/తద్ధర్మార్థక క్రియలు.

మహదర్థం. నజి. కో.స్తా.

| | ఏ. వ. | బ. వ. | ఏ. వ. | బ. వ. |
|---|---|---|---|---|
| a) | | | | |
| ప్ర. పు. | వస్తడు | వస్తరు | వస్తాడు | వస్తారు |
| | వస్తాడు | వస్తారు | | |
| మ. పు. | వస్తవు | వస్తరు | వస్తావు | వస్తారు |
| | వస్తావు | వస్తారు | | |
| ఉ. పు. | వస్త/వస్తను | వస్తం | వస్తా/వస్తాను | వస్తాం |
| | వస్తాను | | | |
| b) | | | | |
| ప్ర. పు. | వచ్చు | వద్దురు | | |
| | వద్దువు | వద్దురు | వద్దువు | వద్దురు |
| | వద్దు/వద్దును | వద్దుం | | |

అమహదర్థం :

| | | | | |
|---|---|---|---|---|
| ప్ర. పు. | వస్తది | వస్తయి | వస్తుంది | వస్తాయ్ |
| | వస్తాది | వస్తయ్ | — | — |
| మ. పు. | — | — | — | — |
| ఉ.పు. | — | — | — | — |
| b) | వచ్చు | వచ్చు | — | — |
| | — | — | — | — |
| | — | — | — | — |

వాడుక తెలుగులో భవిష్యదర్థాన్ని తెలియజేసే ప్రత్యేక క్రియలు లేవు. తద్ధర్మార్థక క్రియలే భవిష్యదర్థంలోనూ వాడబడ తాయి. కోస్తా భాషలో ధాతువుమీద 'తా' ప్రత్యయం చేరి ఈ క్రియా

రూపాలు ఏర్పడతాయి. న జి. వాడుకలో 'తా' లోని దీర్ఘం హ్రస్వ మౌతుంది. ఉదా:- వస్తాడు - వస్తడు మొ॥ ఈ మార్పు తెలంగాణ మంతటా కనిపిస్తుంది. న జి.లో వస్తాడు మొ॥ హ్రస్వం రాని రూపాలకు కూడా కాకువుచే అర్థ విశేషం సూచితమైనప్పుడు ప్రయోగం ఉంది.

పై వాటిలో అనుమహదర్థక ప్ర. పు. ఏకవచన రూపమైన 'వస్తుంది' అనే రూపంలో 'తు' లోని ఉకారం న. జి. వ్యవహారంలో అకారంగా మారినప్పుడు బిందువు లోపించడం గమనించాలి

వస్తుంది > వస్తంది > వస్తది.

పైన 'బి' భాగంలో చూపబడిన క్రియలు తద్ధర్మక క్రియలే ఐనా వాటికి న జి. లో తద్ధర్మార్థంలో కాక లృబర్థంలో వాడుక ఉండడం గమనించదగ్గ అంశం.

1 నిన్ననే చెప్పింటె ఆయన ఇవ్వాళ వచ్చు.
(నిన్ననే చెప్పి ఉంటే ఆయన ఇవ్వాళ వచ్చి ఉండేవాడు)

2. ముందే చెప్పింటే వాండ్లు రేపొద్దురు కదా!
(ముందే చెప్పిఉంటే వాళ్ళు రేపు వచ్చేవాళ్ళు)

3. నిన్ననే చెప్పింటె ఇవ్వాళ పోదు.
(నిన్ననే చెప్పి ఉంటే ఇవ్వాళ పోయేవాణ్ణి)

4. ముందు చెప్పింటె రేపొద్దు.
(ముందు చెప్పి ఉంటే రేపు వచ్చేవాణ్ణి)

లృబర్థంలో పైవిధంగా తద్ధర్మార్థక క్రియలే కాక వస్తుండె, వస్తుండిరి మొదలైన రూపాలుకూడా వాడుకలో ఉన్నాయి.

నిన్ననే చెప్పింటె ఆయన ఇవ్వాళ వస్తుండె.
ముందే చెప్పింటె వాళ్లు ఇవ్వాళ వస్తుండిరి. మొ॥

**విధ్యర్థకాలు :**

ధాతువుపై 'అలి' అనే రూపం చేరి ఏర్పడిన విధ్యర్థక రూపాలు కోస్తా జిల్లా వాడుకలో కనిపిస్తే న. జి. వాడుకల్లో 'అలె' అనేది చేరిన రూపాలు కనిపిస్తాయి. ఈ రెండూ 'వలయును' అనే ప్రాచీన విధ్యర్థకరూపానికి వికృతిరూపాలే.

| కోస్తా | న.జి. |
|---|---|
| చదువాలి | చదువాలె |
| రాయాలి | రాయాలె |
| పోవాలి | పోవాలె |
| రావాలి | రావాలె |

చదువు మొదలైన మూడక్షరాల ధాతు రూపాల్లో చివరి అక్షరంలో ఇకారేతర అచ్చు ఉన్నప్పుడు మధ్యాక్షరంలోని ఉకారం కోస్తా వ్యవహారంలో అకారంగా మారుతుంది. న.జి. లో మాత్రం ఉకారంగానే ఉంటుంది.

| కోస్తా | న.జి. |
|---|---|
| చదవాలె | చదువాలె |
| చదవక | చదువక |
| చదవడం | చదుపడం |

**ఆజ్ఞార్థకాలు :**

ఆంధ్రదేశం అన్ని ప్రాంతాల్లోనూ ఆజ్ఞార్థకాలు ఒకేరూపంలో ప్రయోగింపబడుతున్నా తెచ్చు, వచ్చు పోవు మొ॥ ధాతువుల మధ్యమ పురుష బహువచన రూపాల్లో మాత్రం న.జి. వ్యవహారంలో కొంత భేదం కనిపిస్తుంది.

| కోస్తా | న. జి. |
|---|---|
| తెండి | తేండి/తెండి |
| రండి | రాండి/రండి |
| పొండి | పోండి/పొండి |
| లెండి | లేండి/లెండి |

కోస్తా వాడుకలోని రూపాల్లో ధాతురూపం హ్రస్వాంతంగా ఉంటే న. జి. వాడుకలో దీర్ఘాంతంగానూ, హ్రస్వాంతంగానూ ఉంటుంది.

**వ్యాపారసాతత్యబోధకక్రియలు :**

అదే పనిగా అవిచ్ఛిన్నంగా జరిగే వ్యాపారాన్ని తెలిపే క్రియలను వ్యాపార సాతత్య బోధకక్రియలు అని వ్యవహరించవచ్చు. న.జి. భాషలో నుజ్యంత క్రియపై 'పట్టు' అనే అనుబంధక్రియ చేరిన రూపాలూ, శత్రర్థకంపై 'చేరు' అనే అనుబంధం చేరిన రూపాలూ వాడుకలో ఉన్నాయి.

పట్టు : చెప్పబట్టె, చేయబట్టె, రాయబట్టె మొ॥

చేరు : తినుకుంట జేరిండు, రాసుకుంట జేరిండు, చేసుకుంట జేరిండు మొ॥

**సామర్థ్యబోధకక్రియలు :**

అన్ని ప్రాంతాల వాడుకలోనూ సామర్థ్యార్థంలో ధాతువుపై 'కలుగు' అనే క్రియతో పాటు 'చాలు' అనే అనుబంధక్రియ కూడా చేరుతుంది. ఐతే తక్కిన ప్రాంతాల్లో 'చాలు' అనేది వ్యతిరేక క్రియల్లో మాత్రమే చేరుతుంది. ఉదా : చేయజాలడు, రాయజాలడు మొ॥ కాని న.జి. వాడుకలో వ్యతిరేకార్థంలేని సందర్భంలో కూడా 'చాలు' అనుబంధక్రియ చేరుతుంది.

ఉదా : చేయజాల్తడు, రాయజాల్తడు, పోజాల్తడు.

**క్రియాతిపత్తిక్రియలు :**

చదువాల్సి ఉండింది, తినాల్సి ఉండింది మొదలైన అర్థాల్లో నుజ్యంత క్రియలపై ఉండు ధాతువు భూతార్థక రూపాలు అనుబంధంగా చేరిన రూపాలు న.జి. వాడుకలో కనిపిస్తాయి.

| | |
|---|---|
| చదువనుండె | చదువనుండిరి |
| చదువనుంటివి | చదువనుంటిరి |
| చదువనుంటి (ని) | చదువనుంటిమి |

ఈ అర్థంలో చదివేదుండె రాసేదుండె, మొదలైన క్రియా రూపాలు కూడా వాడుకలో ఉన్నాయి. ఐతే ఇవి పురుష వచన భేదాన్ని బట్టి మార్పు పొందక అన్ని పురుష రూపాల్లో ఒకే విధంగా ప్రయోగింపబడతాయి.

సుదూర భూతార్థాన్ని తెలియజేయడానికి క్త్వార్థంపై ఉండు ధాతువు భూతార్థక రూపాలు చేరడం న.జి. వ్యవహారంలో కనిపిస్తుంది. క్త్వార్థం మీద నకారగమం వికల్పంగా రావడం, నకారాగమం రాని పక్షంలో పూర్వరూపసంధి రావడం ఈ రూపాల్లోని విలక్షణత

నకారాగమం :

| | |
|---|---|
| చదివినుండె | చదివినుండిరి |
| చదివినుంటివి | చదివినుంటిరి |
| చదివినుంటి (ని) | చదివినుంటిమి |

పూర్వరూపసంధి :

| | |
|---|---|
| చదివిండె (చదివి+ఉండె) | చదివిండిరి (చదివి+ఉండిరి) |
| చదివింటివి (చదివి+ఉంటివి) | చదివింటిరి (చదివి+ఉంటిరి) |
| చదివింటిని (చదివి+ఉంటిని) | చదివింటిమి (చదివి+ఉంటిమి) |

వీటి అర్థంలో చదివిందు, చదివె మొదలైన రూపాలు కూడా వాడుకలో ఉన్నాయి.

## వ్యతిరేకార్థక క్రియలు

**వర్తమానక్రియలు :**

**మహదర్థం :**

| | న.జి. ఏ.వ. | న.జి. బ.వ. | కోస్తా ఏ.వ. | కోస్తా బ.వ. |
|---|---|---|---|---|
| ప్ర. పు. | వస్తలేదు | వస్తలేరు | రావడంలేదు | రావడంలేదు |
| మ. పు. | వస్తలేవు | వస్తలేరు | ,, | ,, |
| ఉ. పు. | వస్తలే(న్)ను | వస్తలేం | ,, | ,, |

**అమహదర్థం :**

| | న.జి. ఏ.వ. | న.జి. బ.వ. | కోస్తా ఏ.వ. | కోస్తా బ.వ. |
|---|---|---|---|---|
| ప్ర. పు. | వస్తలేదు | వస్తలేవు | రావడంలేదు | రావడంలేదు |
| మ. పు. | వస్తలేవు | వస్తలేరు | ,, | ,, |
| ఉ. పు. | వస్తలే(న్)ను | వస్తలే(ం)ము | ,, | ,, |

కోస్తా వ్యవహారంలో వ్యతిరేక వర్తమానక్రియలు భావార్థక కృదంత రూపాలపై లేదు / లేడు మొ॥ చేర్చడంవల్ల ఏర్పడితే, న.జి. వాడుకలో శత్రంత ధాతురూపాలపై లేదు / లేడు మొ॥ చేర్చడం వల్ల ఏర్పడతాయి. న.జి. వ్యవహారంలో వర్తమాన క్రియా రూపానికి సమాన రీతిలో వ్యతిరేకక్రియారూపం ఉండడం గమనించ దగ్గ అంశం.

వస్తున్నాడు (వస్తు+ఉన్నాడు)-వస్తలేడు (వస్తు+లేడు)
తింటున్నాడు (తింటు+ఉన్నాడు)-తింటలేడు (తింటు+లేడు)

**భూతక్రియలు :**

వ్యతిరేక భూతార్థంలో సాధారణంగా అన్ని ప్రాంతాల్లోనూ ధాతువుకు 'లే' అనేది అనుప్రయుక్తమౌతుంది.

ఉదా:- రాలేదు, చదువలేదు, తినలేదు మొ॥ అన్ని పురుష ల్లోనూ, అన్ని వచనాల్లోనూ ఈ రూపం ఒకే రూపంలో ఉంటుంది.

న. జి. లో వ్యతిరేక తద్ధర్మక్రియపై అగు ధాతువు భూతార్థక క్రియా, వ్యతిరేక క్త్వార్థకక్రియపై 'పోవు' ధాతువు భూతార్థకక్రియా అనుబంధాలుగా చేరి వ్యతిరేక భూతార్థక రూపాలుగా ఏర్పడడం కూడా కనిపిస్తుంది.

| ఏ. వ. | బ. వ. |
|---|---|
| i) చెప్పకపాయె | చెప్పకపోయిరి |
| ii) చెప్పడాయె / చెప్పదాయె | చెప్పరైరి/చెప్పరాయె మొ॥ |

పై భూతకాలికక్రియలు కేవలం వ్యతిరేకార్థాన్నే కాక అర్థ విశేషాన్ని కూడా సూచిస్తున్నాయి. ఎదిరి చూస్తున్న క్రియావ్యాపారం జరగనప్పుడే ఈ రకమైన క్రియారూపాలకు ప్రయోగం కనిపిస్తుంది. ప్రాచీనమైన ఈ క్రియారూపాలకు నేటి వ్యవహారంలో అర్థభేదం కలిగిందన్నమాట. భారతంలో ఈ విధమైన క్రియారూపాలు ఎన్నో ఉన్నాయి.

నల్ల లేదయ్యెనేని (1-2-82)
ఏల బోధింపవైతివి (1-2-159)
దంష్ట్రలు నాటవయ్యె (1-3-13)
నమ్మనేరనయ్యెద (1-4-30)

ii) వ్యతిరేక తద్ధర్మార్థాన్ని, వ్యతిరేక భవిష్యదర్థాన్ని తెలియజేసే ఉత్తమ పురుష క్రియల్లో ఉత్తమ పురుష ప్రత్యయమైన 'ను' వర్ణకం కోస్తా వ్యవహారంలో నిలుస్తుంది. ఉదా : చదవను, తినను, వెళ్ళను, రాయను. మొ॥ కాని న. జి. వాడుకలో 'ను' వర్ణక రూపాలతోపాటు ను వర్ణకం లోపించిన రూపాలు కూడా ఉన్నాయి.

ఉదా:- చదువను/చదువ తినను/తిన
వెళ్ళను/వెళ్ళ రాయను/రాయ

iii) సుదూరభూతార్థాన్ని తెలియజేయడానికి క్త్వార్థం మీద ఉండు ధాతువు భూతార్థక క్రియారూపాలు చేరి చదివిండె, చదివింటివి, చదివింటివి మొదలైన రూపాలు ఏర్పడతాయని ముందు తెలుసుకున్నాం. వీటి వ్యతిరేకార్థక క్రియలు కూడా ఇదే రీతిలో, అంటే వ్యతిరేకార్థక క్రియమీద ఉండు ధాతువు భూతార్థక క్రియారూపాలు చేరి ఏర్పడతాయి.

చదువకుండె (చదువక+ఉండె)
చదువకుంటివి (చదువక+ఉంటివి)
చదువకుంటిని (చదువక+ఉంటిని)

ఉదా:- నువ్వు బాగ చదువకుంటివి. అందుకే మంచి మార్కులు రాలేదు.

**అనుమాపక క్రియలు :**

తెలుగుభాష వాడుకలో ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ చదివి, వెళ్ళి మొదలైన క్త్వార్థకరూపాల్లో ఎట్టి మార్పూ కనిపించదు. అంతటా ఒకే రూపంలో వాడుకలో ఉన్నాయి. ఐతే ఆత్మనే పదార్థంలో కొను ధాతువు అనుబంధంగా చేరిన ధాతువుల్లో మాత్రం న.జి. వాడుకలో కొద్దిభేదం కనిపిస్తుంది.

i) అనుబంధంగా చేరే 'కొను' లోని ఒకారం వికల్పంగా దీర్ఘంగా మారుతుంది.

చదువుకోని / చదువుకొని; అమ్ముకోని / అమ్ముకొని
తీసుకోని / తీసుకొని; రాసుకోని / రాసుకొని

ii) పై క్త్వార్థకక్రియలకు పోవు, వచ్చు క్రియారూపాలు పరంగా ఉన్నప్పుడు కోస్తా వాడుకలో కొని 'కు' గా మారితే న.జి. వాడుకలో 'క' గా మారుతుంది.

| కోస్తా | న.జి. |
|---|---|
| పట్టుకురా | పట్టుకరా |
| తీసుకురా | తీసుకరా |
| తోలుకుపో | తోలుకపో |
| తోలుకురా | తోలుకరా |

కాని 'క' గా మారిన రూపాలు ప్రాచీన భాషలో ఎన్నో కనిపిస్తాయి.

గరళంబెత్తుక గ్రోలగాఁదలచితే (భా.రా)

మది దున్నుక బ్రతుకవచ్చు (సుమతి శతకం)

**తుమున్నర్థకాలు :**

కోస్తా మాండలికలో అడాంతమైన భావార్థకాల మీద షష్ఠీవిభక్తి ప్రత్యయం చేరి తుమున్నర్థరూపాలు ఏర్పడతాయి. (తినడానికి, పోవడానికి మొదలైన) న.జి. భాషలో ధాతువు మీద 'అందుకు' చేరి ఈ రూపాలు ఏర్పడుతాయి. ధాతువు చివర 'త'కారం అగమంగా చేరుతుంది.

| కోస్తా | న.జి. |
|---|---|
| వస్తందుకు (వచ్చు+అందుకు) | రావడానికి (రావడము+కు) |
| పోతందుకు (పోవు+అందుకు) | పోవడానికి (పోవడము+కు) |
| తింటందుకు (తిను+అందుకు) | తినడానికి (తినడము+కు) |
| రాస్తందుకు (రాయు+అందుకు) | రాయడానికి (రాయడము+కు) |

చదివే, తినే, పోయే మొదలైన తద్ధర్మార్థక విశేషణాల మీద కూడా 'అందుకు' చేరి తుమున్నర్థకాలు ఏర్పడడం న. జి. భాషలో కనిపిస్తుంది అప్పుడు వీటి చివరి దీర్ఘం హ్రస్వంగా మారుతుంది. టకారం ఆగమంగా కూడా చేరుతుంది.

వచ్చేటందుకు (వచ్చే+అందుకు) తినెటందుకు (తినే+అందుకు)
పోయెటందుకు (పోయే+అందుకు) రా నెటందుకు (రానే+అందుకు)

ప్రాచీన భాషలో తినను/తినన్ మొదలైన నుజ్యంత రూపాలు తుమున్నర్థకాలు. ఆధునిక భాషలో రాను, పోను క్రియలకు తప్ప ఏ ప్రాంతంలోనూ వీటికి వ్యస్తంగా ప్రయోగం కనబడదు. కాని న.జి. మాత్రం క్రియా రూపాలు పరంగా ఉన్నప్పుడు వీటి ప్రయోగం కనిపిస్తుంది.

i) తినబోయిండు (తినన్+పోయిండు)
దున్నబోయిండు (దున్నన్+పోయిండు)
సంపాదించబోయిండు (సంపాదించన్+పోయిండు)

పై రూపాల్లో నుజ్యంత రూపాల్లోని ద్రుతం నిత్యంగా లోపించింది. దీర్ఘాంత ధాతువుల మీద మాత్రం ఈ ద్రుతలోపం వైకల్పికం.

తేన్ బోయిండు } తీసుకు రావడానికి పోయినాడు.
తే బోయిండు

తీసుకరాన్ బోయిండు } తీసుకురావడానికి పోయినాడు.
తీసుకరా బోయిండు

**అనంతర్యార్థకాలు :**

న. జి. భాషలో ఆనంతర్యార్థంలో భూతార్థక క్రియాజన్య విశేషణాలపై 'అంక' అనే ప్రత్యయం చేరుతుంది.

| న.జి. | కోస్తా |
|---|---|
| వచ్చినంక | వచ్చాక |
| పోయినంక | పోయాక |
| తిన్నంక | తిన్నాక |
| రాసినంక | రాసాక |

శత్రర్థకాలు :

ప్రాచీన భాషలోని శత్రర్థక చు వర్ణానికి బదులుగా ఆధునిక భాషలో 'తూ' వర్ణకం వాడబడుతుంది. ఉదా:- చదువుతూ, రాస్తూ మొ॥ వీటికి కొను ధాతువు చేర్చగా ఏర్పడ్డ చదువుకుంటూ, చదువుకుంటు, రాసుకుంటూ, రాసుకుంటు మొ॥ రూపాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి. వీటిలో రెండో రకానికి చెందిన రూపాలే న.జి. వాడుకలో ఉన్నాయి. ఐతే వీటిలో శత్రర్థ 'టు' వర్ణకం మీది ఉకారం అకారంగా మారుతుంది

| న.జి. | కోస్తా |
|---|---|
| చదువుకుంటు/చదువుకుంట; | చదువుకుంటూ |
| రాసుకుంటు/రాసుకుంట | రాసుకుంటూ |

న.జి.లో 'తు' వర్ణకంతో కూడిన శత్రర్థక రూపాలు అసలే లేకపోలేదు. ఐతే శత్రర్థక రూపానికి ద్విరుక్తి ఉన్నపుడు, అవధారణార్థం పరంగా ఉన్నప్పుడు మాత్రమే వీటి వాడుక కనిపిస్తుంది. తు వర్ణకంలోని ఉకారం అకారంగా కూడా మారుతుంది.

| | | |
|---|---|---|
| a) | చదువుత చదువుత | చదువుతూ చదువుతూ |
| | పోత పోత | పోతూ పోతూ |
| | రాస్త రాస్త | రాస్తూ రాస్తూ |
| b) | చదువుతనే | చదువుతూనే |
| | పోతనే | పోతూనే |
| | రాస్తనే | రాస్తూనే |
| | వస్తనే | వస్తూనే |

శత్రర్థక 'తు' వర్ణకాంత ధాతురూపంపై 'పోవు' ధాతువు చేరినప్పుడు మాత్రం దీర్ఘాంతమైన 'తూ' వర్ణకం వికల్పంగా 'తా'గా మారడం న.జి. వాడుకలో కనిపిస్తుంది.

రాస్తా/రాస్తూ పోయిండు    రాస్తూ పోయాడు
చెబుతా/చెబుతూ పోయిండు    చెబుతూ పోయాడు

చేదర్థకాలు : ఆధునిక భాషలో చేదర్థంలో వచ్చే 'తే' న.జి. భాషలో ప్రాస్వాంతంగా వాడబడుతుంది.

చదివితె    అడిగితె    పోతె    ఇస్తె

ఈ రూపాలకు కాలత్రయంలోనూ వాడుక ఉన్నది. క్త్వార్థంపై ఉండు ధాతువు చేదర్థకరూపకం చేరిన రూపాలు కూడా చేదర్థంలో వాడబడుతున్నాయి.

తెచ్చింటె (తెచ్చి+ఉంటె)  చదివింటె (చదివి+ఉంటె)

ఇక్కడ సంధిలో పూర్వపరస్వరాలకు పూర్వస్వరం ఏకాదేశం కావడం విశేషం. పరస్వరం ఏకాదేశంగా వచ్చిన వచ్చుంటె, చదివుంటె మొదలైన రూపాలకు కూడా వాడుక ఉన్నది.

వ్యతిరేక క్త్వార్థక క్రియలమీద 'పోతె' అనే పోవు ధాతువు చేదర్థక రూపం చేరి వ్యతిరేక చేదర్థకరూపాలు ఏర్పడడం కోస్తా వ్యవహారంలో కనిపిస్తుంది. న. జి. లో ఈ రూపాలతోపాటు 'ఉంటె' అనే ఉండు ధాతువు చేదర్థకరూపం చేరి ఏర్పడిన రూపాలు కూడా వాడుకలో ఉన్నాయి. ఈ రెండూ ప్రాస్వాంతాలే

చదువకపోతె    చదువకుంటె
రాకపోతె    రాకుంటె
రాయకపోతె    రాయకుంటె

సతిసప్తమ్యర్థకాలు :

1) కోస్తా జిల్లాల్లోనూ, న జి. లోనూ శత్రర్థక రూపంపై 'ఉంటె' అనేది చేరి సతిసప్తమ్యర్థకరూపాలు ఏర్పడడం కనిపిస్తుంది. ఐతే కోస్తా వ్యవహారంలో 'తూ' అనే శత్రర్థక వర్ణకానికీ, ఉంటె

అనే అనుబంధానికి సంధి రాదు. న. జి. వ్యవహారంలో మాత్రం సంధి వస్తుంది.

వస్తుంటె (వస్తూ ఉంటె) పోతుంటె (పోతూ+ఉంటె)
రాస్తుంటె (రాస్తూ ఉంటె) తింటుంటె (తింటూ+ఉంటె)

ii) శత్రర్థక తు వర్ణకాంత దాతు రూపాలపై 'ఉండంగ' అనే రూపం చేరి సతిసప్తమ్యర్థకాలు ఏర్పడడం కూడా న.జి వాడుకలో ఉన్నది.

చదువుతుండంగ చెప్తుండంగ
వస్తుండంగ పోతుండంగ
రాస్తుండంగ తింటుండంగ

iii) నుజ్యంతమైన దాతువుపై 'కన్' చేరి సతిసప్తమ్యర్థకాలు ఏర్పడడం అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది ఐతే కోస్తా ప్రాంతం వ్యవహారంలో దాతువుమీద ద్రుతం లోపించి 'కన్'లోని అకారం దీర్ఘంగా మార్చి, చేయగా మొదలైన రూపాలు ఏర్పడతాయి. న. జి. వాడుకలో మాత్రం దాతువుమీది ద్రుతం పూర్ణబిందువుగా మారుతుంది కన్‌లోని అకారం హ్రస్వంగానే ఉంటుంది.

చెప్పంగ (చెప్పగా) రాంగ (రాగా)
తినంగ (తినగా) రాయంగ (రాంగ)

ద్రుతం పూర్ణబిందువుగా మారిన ప్రాచీనగ్రాంథికరూపం నేటికీ న. జి. భాషలో నిలిచి ఉన్నదన్నమాట.

యద్యప్యర్థకాలు :

న. జి. లో వచ్చినా, పోయినా మొదలైన యద్యప్యర్థకాల మీద స్వార్థంలో కూడ, కాని అనేవి అనుబంధాలుగా చేరడం కనిపిస్తుంది.

గ్రంథాలయ

i) వచ్చినాగాని, చేసినాగాని, పోయినాగాని
ii) వచ్చినాగూడ, చేసినాగూడ, పోయినాగూడ

చేదర్థక రూపాలమీద కూడా 'కూడ' అనేది చేరి ఈ రూపాలు ఏర్పడడం న. జి. వాడుకలో ఉన్నది.

తీస్కుంటెగూడ పోతెగూడ వస్తెగూడ

## వాక్య నిర్మాణం

వాక్యనిర్మాణంలో న.జి. భాషకు, కోస్తా భాషకు పెద్దగా తేడాలు కనిపించకపోయినా న.జి. వాడుకలోని వాక్యాల్లో కొన్ని ప్రత్యేకతలు కనిపిస్తున్నాయి.

1. వాక్యంలోని వ్యతిరేక తద్ధర్మార్థక క్రియాపదానికి 'అను' అనే అనుబంధం చేరినప్పుడు ఆ వాక్యం ప్రశ్నార్థకమౌతుంది.

ఉదా : వాడు రాదను? (వాడు రాడా?)
వాడు పోదను? (వాడు పోడా?)
నువ్వు చదువవను? (నువ్వు చదువవా?)

2. కొన్ని వాక్యాల్లో ఉర్దూభాషాప్రభావం కనిపిస్తుంది.

ఉదా : 1. నేను చెప్పేది ఇదిగదా అంటె
(మై బోల్‌నా యహహై....)
2. ఈ కార్యక్రమం ఏదైతే ఉందో
(యహ్ కార్యక్రమ్ జోహై....)
3. చాయ త్రాగిస్తారా?
(చాయ్ పిలాతే కా)

వాక్యంలో ఎప్పుడు, ఎట్ల, ఎందుకు మొ॥ ప్రశ్నార్థక పదాలను వాడినప్పుడు ఉత్తమపురుష తద్ధర్మార్థక క్రియల ప్రయోగంలో

కొంత విలక్షణత కనిపిస్తుంది. చెప్పుదును, వత్తును, రాద్దును మొదలైనవి ఉత్తమపురుష క్రియారూపాలు ప్రశ్నార్థక పదాలను వాడినప్పుడు మాత్రం ఈ రూపాలతోపాటు వీటి నుజ్యంతరూపాలు కూడా న.జి. వాడుకలో ఉండడం గమనించదగ్గ అంశం.

ఉదా : ఎట్ల జెప్ప(ను) / ఎట్ల జెప్పుదు(ను) (ఎట్లా చెప్పేది)
ఎట్ల రాను / ఎట్ల వద్దు(ను) (ఎట్లా వచ్చేది?)
ఎప్పుడు రాయ(ను) / ఎప్పుడు రాద్దు(ను) (ఎప్పుడు రాసేది?)

పై వాటిలో చెప్పను, రాయను, చెప్పుదును, వద్దును, రాద్దును మొ॥ క్రియల్లో చివరి 'ను' వర్ణకం వికల్పంగా లోపిస్తుంది.

నిశ్చయార్థంలో క్రియాపదంపై లే, పో అనే మధ్యమపురుష క్రియాపదాలు సాధారణంగా అన్ని ప్రాంతాల్లోనూ వాడడం కనిపిస్తుంది. ఉదా : వస్తాడు లే, వస్తాడులెండి, వస్తాడు పో, వస్తాడు పొండి మొ॥ ఐతే న.జి. వాడుకలో లే/లెండి, పో/పొండి అనే క్రియాపదాలతోపాటు 'తీయు' ధాతువు మధ్యమపురుష క్రియా రూపాలైన తియ్/తియ్యి, తియ్యండి అనే రూపాలు కూడా కనిపిస్తాయి.

ఉదా : వస్తడు తియ్/తియ్యి! వస్తడు తియ్యండి
చదువుతడు తియ్/తియ్యి; చదువుతడు తియ్యండి

న.జి. లోని నేటి వాడుక భాషలో ఎన్నో ప్రాచీన భాషా రూపాలు ఉండడం గమనించదగ్గ అంశం. కాలవాచకాలపై పంచమ్యర్థంలో కోలెన్ ప్రత్యయం, చెప్పడాయె. చెప్పరైరి మొదలైన వ్యతిరేక భూతకాలిక క్రియలు, తినంగ, రాయంగ మొదలైన సతిసప్తమ్యర్థాలు, కాడ, తాన మొ॥ సమీపార్థకాలు, (ఇవి కడ, తావున అనే

రూపాలనుండి ఏర్పడ్డవి) తల, తలకు, మొ॥ సమయార్థకాలు, తేన్ (తేన్ బోయిండు) చదువన్ (చదువబోయిండు) మొదలైన నుజ్యంత రూపాలు, ఉండె, ఉండిరి (వచ్చిండె, వచ్చిండిరి) మొదలైన భూతకాలిక క్రియలు, అందుల (అందులో) మొ॥ పదాలు ఇందుకు ఉదాహరణలు. ఈ జిల్లాలో వాడుకలో ఉన్న అనేక మాండలిక పదాలకు కావ్యప్రయోగాలు కూడా కనిపిస్తున్నాయి. అట్టి కొన్ని ప్రయోగాలు చివర అనుబంధంలో చూపబడ్డాయి. కావ్య వాఙ్మయమంతా జాగ్రత్తగా పరిశీలిస్తే మరెన్నో ప్రయోగాలు లభించే అవకాశం లేకపోలేదు.

ప్రస్తుత తెలుగు విశ్వవిద్యాలయం వారు, పూర్వపు ఆం.ప్ర. సాహిత్య అకాడెమీవారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య జి యన్. రెడ్డి, ఆచార్య తూమాటి దొణప్ప, డా॥ బూదరాజు రాధాకృష్ణ, ఆచార్య జి. నాగయ్యగారల సంపాదకత్వంలో సిద్ధం చేయించి ప్రచురించిన మాండలిక వృత్తి పదకోశాలకు తెలుగు నిఘంటు చరిత్రలో అమూల్యమైన స్థానం ఉన్నది. ఆయా వృత్తులకు సంబంధించిన ఎన్నో మాండలిక పదాలు - నిఘంటువుల్లోకి ఎక్కనివి - వీటిలో సేకరించబడటం వీటి విశిష్టత. ఐతే ఏ వృత్తులకూ సంబంధించని మాండలిక పదాలుకూడా తెలుగులో అనేకం ఉన్నాయి. ప్రత్యయాలు, అవ్యయాలు మొ॥ వాటిలో కూడా మాండలిక భేదం కనిపిస్తుంది. వీటన్నింటినీ సేకరించి గ్రంథస్థం చేయడం ఎంతో అవసరం.

ఈ మధ్య పత్రికలు, రేడియో, టీవీ, సినిమా మొదలైన ప్రచార సాధనాల్లో వచ్చే తెలుగు భాషా ప్రభావం వల్ల ఆయా జిల్లాల్లోని పల్లెటూళ్ళలో ఉండే ప్రజలు తాము వాడుతున్న భాష అంత ప్రామాణికం కాదన్న భావంతో దాన్ని వదలి తమకు అసహజమైన భాషను ప్రయత్నపూర్వకంగా అలవాటు చేసుకోవడం కనిపిస్తుంది.

దీనివల్ల రెండు అనర్థాలు కలుగుతున్నాయి. ఒకటి- వారు తమ సహజమైన పలుకుబడిని, ప్రయోగాల్లోని మాధుర్యాన్ని కోల్పోవడం. రెండోది- తమకు అసహజమైన పలుకుబడి సరిగా అలవాటు కాక హాస్యాస్పదులు కావటం. తాము వ్యవహరిస్తున్న భాష న్యూనమనే భావం వ్యవహర్తల్లో రాగూడదు. వాళ్ళ వ్యవహారంలో ఉన్న పలుకుబడుల విశేషమేమిటో తెలియక తమ భాషా సహజత్వానికి మాధుర్యానికి దూరం కావడం యుక్తం కాదు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ పరిశోధకులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు భాషా విషయంలో వెలిబుచ్చిన అభిప్రాయాలతో దీన్ని ముగిస్తాను.

"అచ్చమైన తెలుగు ఫలాని జిల్లాలదే, ఆ జిల్లాల ప్రయోగాలే గ్రాహ్యాలు, ఇతరములన్నీ పరిత్యాజ్యాలు అని యెవరూ యెవర్ని గర్హింపజాలరు. గర్హించగూడదు. ఇట్లా అన్ని జిల్లాల భాషలనీ ఆదరించేటట్లయితే అవ్యవస్థగా భాష అనేకవిధాల చెడిపోతుందేమో అని భయపడతారు కొందరు. ఆయా పదాలు ప్రయోగించే ప్రజలు చెడిపోయేవారైతే ఆయా పదాలూ చెడిపోతాయి. భాషా చెడిపోతుంది. ఆయా ప్రజలు సంఘంలో అభ్యుదయం చెందేవారయితే వారి పద ప్రయోగాలు, భాషా సంఘంలో అభ్యుదయం చెందేవే అవుతవి. ఆంధ్రులు అనేక జిల్లాల్లో వెల్లివిరిసి, వేరు వేరు స్వరూప స్వభావాలతో పెంపొందుతూ వైవిధ్యంలో ఐకవిధ్యం వెలయించుకొంటున్నట్లే, బహుమండలాలలో బహుముఖాల వేర్వాసి పెంపొందుతూ భాష కూడా తన వైవిధ్యంలో నుండి ఆంధ్రతారూపమయిన యైకవిధ్యాన్ని వెలయించుకుంటూనే ఉంటుంది" (కామధేనువు కథ - భాషా ప్రసక్తి పుట. 21)

"మీ జాతి తక్కువది, మా జాతి యెక్కువది అని అనరానట్టే మీ పలుకుబడి తక్కువది, మా పలుకుబడి యెక్కువది అని యిక

అన వీలుండదు. పై పై జాతులవారి తేరుకొన్న భాషల మెరుగులే ఇంతదాకా సారస్వత రచనలలో సాగుతున్నవి గాని దేశం నాలుగంచులా తిరిగి భాషను సర్వేచేసి దాని సర్వాంగ సౌందర్యమును గుర్తించిన వారెవ్వరున్నారు?" (కామధేనువు కథ - భాషా ప్రసక్తి, పుట. 22)

"దేశము నలుముఖముల నున్న పండితులు, భాషాభిమానులు జేబులలో నోటుబుక్కు లుంచుకొని ఎక్కడివా రక్కడనే తమ తమ ప్రదేశములందలి చమత్కారాధాయకమైన సర్వసాహితీ పరికరములనూ సంధానింప బూనవలెను. యూనివర్సిటీవారు మొదలగువారు వారి నందుకై వినియోగింపవలెను."

"ఇంకో మండలంలో మాట్లాడే కొత్త మాటలు రాకపోతే భాషాపారగు డెట్లా అవుతాడు? అన్యమండలాల్లో కొత్త మాటలన్నీ రావలిసిందే! కొత్త గ్రంథాలు చదువుకొని కొత్త మాటలు నేర్చుకున్నట్లు అన్య మాండలిక గ్రంథాలు చదువుకొని ఆ పదాలు నేర్చుకోవాలి. ఆ మాటలు తెలియవని, ఆ భాష చెడ్డదని అనటం మంచిది కాదు." (కామధేనువు- భాషా ప్రసక్తి పుట. 23 పుట)

## అనుబంధం I

# నల్లగొండ జిల్లాలోని కొన్ని సామెతలు

అత్తా నేను మార్వాణం పోతున్న. నీ కొడుకు ఆకలికి ఆగలేదన్నదట

అవసరమొస్తే అంగుమల్లు లేకపోతే చెంగుమల్లు

ఇంటిదేవర ఇగిలిస్తుంటె పొరుగు దేవర వచ్చి బోనం అడిగిందట

ఇకారం దప్పినోడు దుకాణం పెడితె వచ్చిన గిరాకి మళ్ళిపాయె

ఇరికి ఇగిలిచ్చిందానికంటె వెళ్ళి వెక్కిరించింది మేలు

ఈరమ్మ చెయ్యి పెద్దదే గాని ఇస్తారి చిన్నది

ఈసంలో మాసం తీసినట్లు

ఉచ్చ పోస్తుంటె బుడ్డ దొరికిచ్చుకున్నదట

ఉబ్బుచ్చులకు ఉచ్చ తాగితె నోరంతా గత్తు గత్తు

ఉన్న ఒక్క మెతుకు గంజిలో పొయినట్లు

ఎర్రటోళ్ళది రూపు సింగారం, నల్లటోళ్ళది రాత సింగారం

ఏడ్చి బెదిరిద్దునా, పిత్తి నవ్విద్దునా

ఏ చింతా లేనోనికి కూటిమీదే చింత

ఏతులకు ఏతేశ్వరం పోతె పక్కతోలు కుక్కేసుక పోయిందట

ఏనుగు పంటికి జిలుకర పోన

ఏరుబడితె పందుం లేస్తది. పొత్తులుంటే పొరక లేవదు.

ఐపోయిన పెండ్లికి దప్పుకొమ్ములెందుకు?

ఒకరోజు బాగోతానికి మూతి మీసాలు గొరుక్కుండంట
ఒల్లని కూరల ఉప్పెక్కువ
ఒళ్ళొంగలేక దొంగల కలిసిండట
కాకులు కరణాలు ఒకటి ఒంటి బేగరోడొకటి
కోతికి పుండైతే గోక, నాక ఒకటే పని
కూర్చొని తింటె గుట్టలైనా ఆగవు
కూరాడు వేరైతే కులమంతా వేరే
కొండంత రాగందీసి పిచ్చకుంట్ల పాట పాడిందట
గంగడాటినంతసేపు గంగమ్మ, గంగదాటినంక పింగమ్మ
గడియ పుర్సతులేదు, గవ్వ ఆమ్దాని లేదు
గార్వం గంజికేడిస్తే ముసలోడు లంజెకేడ్చిండట
గాలికిపోయే కంపను ముడ్డికి దగిలించుకున్నడట
గొంతు కోస్తుంటె రక్తం తాగుత నన్నడట
గొల్ల మంకు ఇల్లు చేరదు
చదువు చారెడు, బలుపాలు దోసెడు
చలి బులి తిన్నమ్మ మొగని ఆకలి ఎరుగదట
చస్తుంటె అంబలి తాగొస్త అన్నడట
చస్తుంటె కళ్ళల్ల వేలుబెట్టి చూసిండట
చోటే లేదంటె మూటెక్కడ పెట్టాలన్నడట
తిట్టను పోరా గాడిద కొడుకా అన్నడట
తిననేర్చినమ్మను తీర్థంల చూడు, తాగనేర్చినమ్మను తాళ్ళల్ల చూడు
తిరుగ నేర్చిన కాలు, ఒర్ల నేర్చిన నోరు ఊరుకోదు
తినేది మొగని సొమ్ము, పాడేది మిండెని పాట
తొల్త పుట్టినోడికి తొమ్మిదంగీలు, మల్త పుట్టినోనికి మారంగి లేదు
తనకు బుక్క తవుడు లేదు కాని లంజెకు పందార

తోటోడు తొడ కోసుకుంటె తాను మెడకోసుకుంటనన్నడట
దాచిదాచి దయ్యాలపాలు జేసినట్లు
నాజూకు బీబీ నౌరొటీ ఖాతే
నిచ్చె బూరెలు జేస్తే నిన్నెందుకు కొడ్తానే పెండ్లామా?
అన్నడట

నియ్యతెంతో, బర్కతంత
పది మందిల ఉంటె పని సుఖం, ఒంటరిగ ఉంటె తిండి సుఖం
పటేల్ పట్వారి నా పట్టైతె ఎట్లెట్ల కొడుతవ్ మొగడా!

పందుందిన్నా పడిగడుపే
పుట్టెడాందాలలో కుక్క పొర్లాడినట్లు
పెసరుచేనులో పోగొట్టుకొని పప్పుటికెల దేవులాడిందట
పేరు పెరుమాండ్లది, తినేది అయ్యగారు
పొయ్యి ఊదలేక ఏడు మనువులు బోయిందట
పొంకణాల పోతిరెడ్డికి మూడెడ్లు, ముప్పై దొడ్లు
బతికి చెడ్డోని బట్టలు జూడు, చెడి బతికినోని చెంపలు జూడు
బాపనోళ్ళ సందు, తుర్కోళ్ళ పొయ్యి
మాలగార్వం ఎన్న గాల్చుక తిన్నదట
ముట్టయిన్నాదే ముగ్గురు చుట్టాలు
మొగడు చచ్చినంక ముండ బుద్ధిమంతురాలైందట
రాదన్నపని రాజాపని, వస్తదన్న పని బాంచపని
మంచం చూసి కాళ్ళు ముడువాలె
మంది మాటలు విని మార్వాణం పోతే మల్లొచ్చెసరికి ఇల్లంత
అగమైందట.

ముచ్చట సంబూరాన మొగణ్ణి మర్చిపోయిందట
మొగం బాగలేక అద్దం బగులగొట్టిందట
శరానికి పోతే నరం దెగిందట

## అనుబంధం II

# నల్లగొండజిల్లాలోని కొన్ని మాండలిక పదాలు—పదబంధాలు

**నామవాచకాలు :**

అంకు = అంకె

అంకెం = మిరపకాయలు, పొగాకు మొ॥ వాటి పెద్ద చుట్ట అండెం

అగ్గువ = చౌక

అటికె = చిన్న మట్టికుండ

అడ్రగణం = అన్యాయం

అప్పయ్య = చిన్నాయన

అఱ్ఱ = గది

అల్పం = గర్వం

ఆన్గప్కాయ = సొరకాయ

ఇచ్చులు = వివరాలు

ఇడుస = విడత, పర్యాయం

ఇసుర్రాయి = తిరుగలి

ఈలపీట = కత్తిపీట

ఉద్దెర = అరువు

ఉపసమ్మతి = తృప్తి

ఎరుక = గుర్తు, తెలివిడి

ఏ(యా)ట = గొర్రె

ఏతులు = ప్రగల్భాలు

ఏరాలు = తోడికోడలు

కలెమాకు = కరవేపాకు

కక్కయ, కాక, కాకయ్య } చిన్నాయన

కాల్మడి = మూత్రం

కుడుక = ఎండుకొబ్బరి

కుతి = ఉత్కంఠ

కూరాడు = కలికుండ

గదువ = చిబుకం

గలుమ = గుమ్మం

గార్వం = గారాబం

గుడ్డెలుగు, గుడ్డేలుగు } ఎలుగుబంటు

గురిగి = చిన్న మట్టిపిడత

గోందు = జిగురు, gum

గోకరకాయ = గోరుచిక్కుడు

గోస = బాధ

గ్యాసునూనె = కిరసనాయిలు

జాంబు = లోహపు గ్లాసు

జగిలి = ఇంటి పసారా

జాలాడు, జాలారు } పాత్రలు మొ॥ కడిగే చోటు లేదా స్నానాలు చేసే చోటు

తట్టి, తలె } పళ్ళెం, కంచం

తొక్కు = పచ్చడి

త్రోతిరి = అన్యాయం

దీలిపండుగ = దీపావళి పండుగ

దిగూడు } ఇంటి గోడల్లోని
దీగూడు } చిన్న గూడు

దూప = దాహం, దప్పి

నేవులు = నాణాలు, Coins

పచ్చెన్న = తాజా వెన్న

పలుకునూనె = వేరుసెనగ నూనె

పుంటికూర = గోంగూర

పుట్నాలు = వేపిన సెనగలు, కందులు మొ॥

పెంకాసు = పెంకుముక్క

పెండ్లిపిల్ల = పెండ్లికూతురు

పెయ్యి = శరీరం

పొంకణాలు = ప్రగల్భాలు

పొక్క = రంధ్రం

పొప్పడికాయ = బొప్పాయికాయ

పొల్ల = పిల్ల, బాలిక

పొవ్వాకు = పొగాకు

పోరడు } పిల్లవాడు
పోరగాడు }

పోరి = బాలిక

బేస్తవారం = గురువారం

బొంగులు = ముర్మరాలు

బొండిగె = కంఠం

బొక్క = ఎముక

బ్రమ = ప్రేమ

మాసర = మచ్చ

మెత్త = దిండు

మొల = మేకు
మోంబత్తి = కొవ్వొత్తి
యాది = జ్ఞాపకం
యాష్ట = విసుగు
రేశం = రోషం, కోపం
లగ్గంకోటు = లగ్నపత్రిక
లొల్లి = అల్లరి, గొడవ
సంచకారి = అడ్వాన్సుగా ఇచ్చే డబ్బు
సకిలం ముకిలం = బాసినకట్టు
సాహిత్యం = బ్రాహ్మణులకు భోజనం కోసం ఇచ్చే బియ్యం పప్పు, కూరలు, నూనె, నెయ్యి మొ॥ పదార్థాల సమాహారం
సోపతి = స్నేహం
సోయి = స్పృహ

**క్రియాపదాలు :**

ఉడుకపోయు = ఉక్కపోయు
ఉరుకు = పరుగెత్తు
ఉరికొచ్చు = పరుగెత్తుకొనివచ్చు
ఎంకులాడు = వెతుకు
ఎండేయు = ఆరేయు
ఎచ్చబెట్టు = వేడిచేయు
ఏంచు = లెక్కబెట్టు
ఒడిసిపోవు = ఐపోవు, నిండుకొను
ఒనగూడు = సమకూడు
కక్కు = వాంతి చేసుకొను
కాలంచేయు = మరణించు
కొంచబోవు }
కొంటబోవు } తీసుకపోవు

గోలించు = వేపు
జరిగిపోవు = మరణించు
తొక్కులాడు = బాధపడు, ఉత్కంఠపడు
నోటికి చేయు = కంఠస్థం చేయు
పోదగొట్టుకొను = పోగొట్టుకొను
బమ్మెరపోవు = ఆశ్చర్యపడు
మనసుకు బట్టు = అర్థమగు
మలుపు = ఆర్పు
లేబట్టు = లేపు
సాదు = పోషించు
సైసు = సహించు (చవిచూడు)
సైసూడు = రుచిచూడు

**అవ్యయాదులు :**

మస్తు = చాలు
అదనా = హీనమైన
ఆసర = సుమారు
నెరియా = పూర్తిగా, బొత్తిగా
పురాగ = పూర్తిగా
పొద్దటింతల = పొద్దటిపూట
మస్తుగ = కావలసినంత
ముంజాత = ముందుగా
రాత్రింతల = రాత్రిపూట
లాసిగ = ఉచ్చైఃస్వరంతో
లెక్క = వలె, మాదిరిగా
తోతక్కువ = మిగిలిన

సుత } కూడా, also
సుద్ద }

## అనుబంధం III

# సాహిత్యంలో కొన్ని ప్రయోగాలు

అంబేద=అమాయకుడు

"నావోఁటి యంబేద లెల్లను" చిత్రభారతం 3-93

అగ్గువ=చౌక

"క్రోతి మాంస మగ్గువయయ్యె" రామాభ్యుదయం 8-25

"అగ్గువ యగును ధాన్యంబు మిగుల" రెట్టమతం 3-29

అచ్చుగట్టు=మెట్ట (ఖుష్కి) భూమిని మాగాణి (తరి) భూమిగా మార్చుటానికి గట్లు కట్టి నలుచదరంగా చేయు.

"మాగాణిలో గట్టుకట్టిన మెత్తగా దున్ని యచ్చుగట్టి"

వైజయంతీవిలాసం 1-85

అటిక=వెడల్పు మూతిగల చిన్న మట్టిపాత్ర

"పసిండియటికల దొంతులు గావించి"

రాజశేఖరచరిత్ర 1-128

అట్టు=గది

"అధిపుఁడట్టు సొచ్చె" సింహాసనద్వాత్రింశిక 4-270

ఇంగలము=నిప్పు

"చూపుటింగలమునన్వె త్రోచి" పారిజాతాపహరణం 3-37

"కపిలునింగలపుఁ జూపు సెగలఁగలియు" ,, 2-94

ఇనుకు=ఇంకు

"వార్ధులినికెన్ నక్షత్రముల్ రాలె" మైరావణచరిత్ర 3-91

ఉపాసము=ఉపవాసము

"వేలు నాకి యుపాసంబు గోలుపోయి" అనర్ఘరాఘవం 2-3

ఉసుక=ఇసుక

"ఉసుక వంటకముగా నుడికింపవచ్చు" హరిశ్చంద్రోపాఖ్యానం

ఎసల=వంటకుండ

"వెస లలనామణి బంగవెసలల దొంతరలు డించి"

విజయవిలాసం 2-152

ఏంది=ఏమి, ఏమిటి

"కొమ్మరో నడునెత్తిఁ గొమ్మేంది యా చుట్టు
జడలు చెంపల వ్రేలబడుట యేంది"

రఘునాథరామాయణం 2-145

ఏతులబోవు=బడాయికి పోవు

"ఏతులఁబోవుచున్ దిరుగు నిప్పటిమంత్రుల"

పాండురంగమాహాత్మ్యం 1-73

ఏ (యా) రాలు=తోడికోడలు

"ఏరాలిపట్టి బిట్టెత్తి చెక్కిలి నొవ్వఁ
గఱచి వాడేడ్చిన" పాండురంగమాహాత్మ్యం 3-62

గదువఁ=చిబుకం

"వెదలి గద్దువ మోవ పీడియంబులు చేసి"

కవికర్ణరసాయనం 4-94

గొర్లు=గొర్రెలు

"తొట్రించి గొర్లలోఁ దోడేలు సొచ్చినట్లే గబ్బిలేళ్ళ
నట్టిటు సేయు" సారంగధరచరిత్ర 1-91

తంతె=మెట్టు

"పెట్టించి తంతెలు పెద్దగా లోన" సిద్దేశ్వరచరిత్ర 130 పుట.

"తన కట్టినట్టి తంతెల్ ఘనశితశతదార"

దశరథరాజనందనచరిత్ర 2-116

తూటు=రంధ్రం

"క్రొముదిఁ దననీడఁ దూటు సూచిన"

మహాభారతం; అను. 3-104

తోదెం=కొంచెం

"త్రోదెంబుతోడనె పొద్దుపుచ్చుకొనియెద" మిత్రభేదం

"త్రోదెంపునవ్వులఁ దుఁలకించు వెన్నెలల్"

సత్యభామాసాంత్వనం 4.46

కంటు=శత్రుత్వం

"కంటు నామీద నేల వాల్గంటి నీకు"

అహల్యాసంక్రందనం 3-93

కాల్మడి=మూత్రం

"ఏడిచి కాల్మడి నిలుచుండి నడచి నడచి"

మల్హణచరిత్ర 3 ఆ.

కుతి=కోరిక, ఉత్కంఠ

"తన కుతిఁ దీర్చక దుమ్ము దులుపుకొనుచుండనియెన్"

అనర్ఘరాఘవం 2-28

కూరాడు=కలికుండ

"తేరులన్నియుఁ గూరాటి తేరులుగను"

మొల్ల రామాయణం 4-174

గడెగడెకు=మాటిమాటికి

"గడెగడెకింక వెక్కనము జెందును గదే"

తాళాంకనందినీపరిణయం 3-134

దూప=దాహం, దప్పి

"చాన నీ కెమ్మోవి పానకంబానక

తెరలెదు బలుదూప దీఱిపోదు"

రసికజనమనోరంజనం 6 89

పట్టి=హేత్వర్థంలో వాడబడే పదం

"పాటిపోఁబట్టి రెండేండ్లు బ్రదికెఁగాక"

వెలుఁగోటివారి వంశావళి 414 ప.

పారి=పర్యాయం

"ఒక్కపరి వ్యాఘ్రమై వచ్చు నొక్కపారి దంష్ట్రియై తోఁచు"

ఉత్తరరామాయణం 3-54

పెండ=పేడ

"పెండ యెత్తబడునట్టి ముండకిచ్చె"

సింహాసనద్వాత్రింశిక 1-92

బొక్క=ఎముక

"ఒక్క బొక్కకు వాదడిచి" కేయూరబాహుచరిత్ర 2-91

మా=మహా

"మా నెఱజాణవు" హంసవింశతి 2-152

మొల=మేకు

"గఱిగాన నొదలుల విఱిగెడు వస్త్రముల్
దొలఁగు సందుల కిచ్చు మొలలు గాఁగ"

కుమారసంభవం 11-152

"ఇనకరముక్తమై యిలఁబడు నభమని,
నలువదాచిన వెండి మొలలనంగ" శివలీలావిలాసం

సోయి=స్పృహ.

"సొలసి పరున్నవాడు తన సోయి యెఱుంగక"

క్షత్రబంధూపాఖ్యానం. 3-29

—: o :—

45854
హైదరాబాద్-500 044

# గ్రంథకర్త ముద్రితరచనలు

1. లఘుసిద్ధాంతకౌముది (సంజ్ఞా, సంధి, కృత్ప్రకరణాలకు తెలుగు అనువాదం) 1970
2. సంకేతపదకోశం 1973
3. వ్యాకరణపదకోశం (ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తంగారితో) 1978
4. అలబ్ధకావ్యపద్యముక్తావళి 1983
5. ముకుందవిలాసము (సంపాదకత్వం) 1985
6. నల్లగొండజిల్లా మాండలికపదకోశం 1986
7. సంస్కృతసూక్తిముక్తావళి 1986
8. తెలుగుకవుల సంస్కృతానుకరణలు 1987
9. భాస్కరరామాయణము–విమర్శాత్మకపరిశీలనము 1988
10. తెలంగాణామాండలికాలు–కావ్యప్రయోగాలు 1988
11. త్రిలింగశబ్దానుశాసనమ్ (సంపాదకత్వం) 1988
12. మాతృగీతమ్ (సంస్కృతకవిత) 1989
13. తెలుగులో అలబ్ధవాఙ్మయం 1993

## రానున్న రచనలు :

1. సంస్కృతన్యాయాలు
2. ప్రపంచపదీ (డా॥ సి. నారాయణరెడ్డిగారి ప్రపంచపదులకు సంస్కృతానువాదం)
3. పాణినీయ–అష్టాధ్యాయి (మొదటి నాలుగధ్యాయాలకు తెలుగు అనువాదం)
4. నిఘంటువులకెక్కని పదాలు (నిఘంటువు)
5. ప్రాకృతాంధ్రనిఘంటువు.